

# మనజనప్రగతి

జనం కోసం.. అక్షర ప్రగతి... తెలుగు దినపత్రిక

సంపుటి : 6 | సంచిక : 202 | పేజీలు : 8 | వెల : రూ.2/- సోమవారం 17 ఆగస్టు 2026

Kadapa, Ananthapur, Chittor, Vishakapatanam, Srikakulam, Elluru, Thirupathi, Ongole, Vijayawada, SPSR Nellore, Prakasham, Guntur, Kurnool


## మాది సామాజిక న్యాయం

● వాళ్లు రక్తపిశాచులు...సెప్టెంబర్‌లో అసెంబ్లీ సమావేశాలు ● కేసీఆర్‌ను సైతం తీసుకురావాలని కేటీఆర్, హారీశ్‌లకు విజ్ఞప్తి ● ఆయన విలువైన సూచనలిస్తే రాష్ట్రానికి ఉపయోగం ● నా లెక్కలన్నీ పక్కా చెబుతాను..ఎవరి పాలనేంటో అక్కడే తేల్చుకుందాం ● పరకాల సభలో సీఎం రేవంత్‌రెడ్డి..ములుగు జిల్లా కలెక్టరేట్ ప్రారంభోత్సవం



**వరంగల్,మన జనప్రగతి ఆగస్టు 16:** 'మాజీ సీఎం కేసీఆర్‌ది కుటుంబ న్యాయం.. తమది, తమ పార్టీది సామాజిక న్యాయం' అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. బీఆర్‌ఎస్ హయాంలో వాళ్ల కుటుంబ సభ్యులకు పదవులిస్తే.. తాము మాత్రం సామాజిక సూత్రాన్ని పాటించామని తెలిపారు. ఆదివారం ఉమ్మడి వరంగల్ జిల్లాలో పర్యటించిన సీఎం రేవంత్‌రెడ్డి ములుగు, పరకాల నియోజకవర్గాల్లో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవ ్లలు చేశారు. సాయంత్రం పరకాలలో జరిగిన బహిరంగ సభలో సీఎం మాట్లాడుతూ శాసనసభకు రాకుండా కేసీఆర్ ప్రజా సమస్యలను పట్టించుకోకపోవడాన్ని తప్పుబట్టారు. ఆదివారం ఉమ్మడి వరంగల్ జిల్లాలో పర్యటించిన సీఎం రేవంత్‌రెడ్డి ములుగు, పరకాల నియోజకవర్గాల్లో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. సాయంత్రం పరకాలలో జరిగిన బహిరంగ సభలో మిగతా2లో...



## ఘనంగా జనని-సూర్యతేజ వివాహం..

● సతీసమేతంగా హాజరైన ఏపీ సీఎం చంద్రబాబు..

● ఆనందంతో ఏడ్చేసిన బండ్ల గణేశ్

**హైదరాబాద్,మన జనప్రగతి ఆగస్టు 16:** ప్రముఖ సినీ నటుడు, నిర్మాత బండ్ల గణేశ్ ఇంట పెళ్లి బాజాలు మోగాయి. ఆయన కుమార్తె జనని వివాహం ఆదివారం హైదరాబాద్‌లో అంగరంగ వైభవంగా జరిగింది. పశ్చిమ గోదావరి జిల్లాకు చెందిన సూర్య తేజతో ఆమె ఏడడుగులు వేశారు. ఈ వివాహ వేడుకకు రాజకీయ, సినీ రంగాలకు చెందిన అగ్ర ప్రముఖులు హాజరై నూతన దంపతులను ఆశీర్వదించారు. నగరంలోని జేఆర్సీ కన్వెన్షన్ మిగతా2లో...




## నేటి నుంచి ఏపీ అసెంబ్లీ సమావేశాలు..

- సభకు రావాలని వైసీపీ ఎమ్మెల్యేలకు స్పీకర్ పిలుపు

**అమరావతి : మన జనప్రగతి ఆగస్టు 16:** ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ సమావేశాలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. నాలుగురోజుల పాటు జరుగనున్న అసెంబ్లీ, కౌన్సిల్ సమావేశాలకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. కూటమికి చెందిన టీడీపీ, జనసేన, బీజేపీ మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు సమావేశానికి

మిగతా2లో...

## రష్యాతో బలపడుతున్న సంబంధాలు

- పుతిన్‌కు ఉత్తర కొరియా అధినేత కిమ్ సందేశం



**ప్యాంగ్యాంగ్ మన జనప్రగతి ఆగస్టు 16:** రష్యాతో సంబంధాలు మరింత బలపడుతున్నాయని ఉత్తర కొరియా అధినేత కిమ్ జాంగ్ ఉన్ తెలిపారు. రెండో ప్రపంచ యుద్ధంలో జపాన్ లంగిపోయిన కారణంగా వలస పాలన నుంచి ఉత్తర కొరియా స్వాతంత్ర్యం పొందిన సంగతి తెలిసిందే. జపాన్ లంగుబాటుకు గుర్తుగా జరిగిన 81వ వార్షికోత్సవ వేడుకల సందర్భంగా కిమ్‌కు అభినందనలు తెలుపుతూ రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ శనివారం ఓ సందేశం పంపారు.దీనికి కిమ్ సమాధానం ఇస్తూ సోవియట్ సైనికులు జపాన్‌కు వ్యతిరేకంగా పోరాడుతున్నప్పుడు స్నేహబంధం ఏర్పడిందని, అది మరింత మిగతా2లో...



## 'కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్' రద్దుపై నేడు నిరసనలు

- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు

**హైదరాబాద్,మన జనప్రగతి ఆగస్టు 16:** కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను పూర్తిగా రద్దు చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న కుట్రలకు వ్యతిరేకంగా నేడు రాష్ట్ర వ్యాప్తంగా నియోజకవర్గ, మండల కేంద్రాల్లో నిరసన కార్యక్రమాలు చేపట్టాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. మిగతా2లో...



## ములుగు జిల్లా సమగ్ర అభివృద్ధి, గిరిజనుల సంక్షేమమే లక్ష్యం

తెలంగాణ ఆడబిడ్డ అంటూ సీఎం రేవంత్‌రెడ్డి కితాబు

మహిళా సంఘాలతో సీఎం ముచ్చట.. వాటర్ ప్లాంట్ ప్రారంభం

పోరాటాల ఫలితమే ములుగు జిల్లా : మంత్రి దనసరి సీతక్క

మేడారంలో ముఖ్యమంత్రి ముమ్మర పర్యటన

**ములుగు,మన జనప్రగతి ఆగస్టు 16:** ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ఆదివారం ములుగు జిల్లాలో పర్యటించారు. మేడారం సమ్మక్క-సారలమ్మ వనదేవతలను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ములుగు జిల్లాలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. మేడారంలో గిరిజన పూజారులు మిగతా2లో...

## నేడు సర్ ముసాయిదా విడుదల

- సెప్టెంబర్ 16 వరకు అభ్యంతరాల స్వీకరణ
- అక్టోబర్ 19న తుది ఓటర్ల జాబితా విడుదల



**హైదరాబాద్,మన జనప్రగతి ఆగస్టు 16:** స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్) ప్రక్రియలో భాగంగా సోమవారం ముసాయిదా ఓటర్ జాబితాను రాష్ట్ర ఎన్నికల సంఘం విడుదల చేయనుంది. రాష్ట్రంలో మొత్తం 3,38,26,448 మంది ఓటర్లుకు గాను 2,64,87,214 మంది మిగతా2లో...

## రాష్ట్రంలో మంచి స్కూళ్లు, కాలేజీలు ఎందుకు ఏర్పాటు చేయలేదు? బండి



**హైదరాబాద్,మన జనప్రగతి ఆగస్టు 16:** భారత్ లో మంచి కాలేజీలే లేవని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ అంటున్నారని కేంద్రమంత్రి బండి సంజయ్ తెలిపారు. పదేళ్లు అధికారంలో ఉన్నప్పుడు ఏం చేశారు? అని రాష్ట్రంలో మంచి స్కూళ్లు, కాలేజీలు ఎందుకు ఏర్పాటు చేయలేదు? అని ప్రశ్నించారు. కెటిఆర్ వ్యాఖ్యలపై బండి సంజయ్ విమర్శించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.. పదేళ్ల పాటు సరిపడా టీచర్లను నియమించలేదు? అని పదేళ్ల పాటు యూనివర్సిటీల్లో ఖాళీలను ఎందుకు భర్తీ చేయలేదు? అని బండి ప్రశ్నించారు. స్కూళ్లు బాగాలేవని కొన్నాళ్ల క్రితం మాజీ సిఎం కెసిఆర్ మనవడు చెప్పాడని, కాలేజీలు బాగా లేదని ఇప్పుడు కెసిఆర్ మనవరాలు చెప్తోందని బండి సంజయ్ ఎద్దేవా చేశారు.

## తెలంగాణ ఒత్తిడి వల్లే కేంద్రం జనగణనలో కులగణన చేపట్టింది: పొన్నం



**హైదరాబాద్,మన జనప్రగతి ఆగస్టు 16:** దేశవ్యాప్త కులగణనపై కేంద్రం మోసం చేస్తోందని మంత్రి పొన్నం ప్రభాకర్ ఆరోపించారు. తాము ఇది చేశామని చెప్పుకోవడానికి బిఆర్ఎస్ పార్టీకి ఏమీ లేదని అన్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.. జనగననపై కేంద్రం విడుదల చేసిన ప్రశ్నావళిలో బిసిల ప్రస్తావన లేదని, జనగణన పత్రంలో 40 ప్రశ్నలలో ఎస్సీ, ఎస్టీల ప్రస్తావన మాత్రమే ఉందని పొన్నం తెలియజేశారు. తెలంగాణ ఒత్తిడి వల్లే కేంద్రం జనగణనలో కులగణన చేపట్టిందని పేర్కొన్నారు. రిజర్వేషన్లలో 50 శాతం సీలింగ్ ఎత్తివేసి ఒబిసిలకు న్యాయం చేయాలని, ప్రధాని నరేంద్ర మోడీ అప్పుడు ప్రకటన చేశారని, లెక్కల సేకరణకు వచ్చేసరికి విస్మరించారని పొన్నం విమర్శించారు. జనగణనపై కేంద్రం ఇచ్చిన సర్క్యులర్ ను సవరించాలని, దేశంలో మిగతా2లో...

మనజనప్రగతి
జనం కోసం.. అక్షర ప్రగతి...
తెలుగు దినపత్రిక
17- 08 - 2026

# మాది సామాజిక న్యాయం

(మొదటి పేజీ తరువాయి)

సీఎం మాట్లాడుతూ శాసనసభకు రాకుండా కేసీఆర్ ప్రజా సమస్యలను పట్టించుకోకపోవడాన్ని తప్పుబట్టారు. కేసీఆర్ తన కొడుకు, అల్లుడికి మంత్రి పదవులు ఇచ్చుకున్నాడని గుర్తు చేశారు. కానీ.! తాను మాత్రం కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఆడబిడ్డలైన సీతక్క, కొండా సురేఖలను మంత్రిపదవుల్లో కూర్చోబెట్టామని తెలిపారు. కేసీఆర్ ఎర్రబెల్లికి మినిస్టర్ పదవి ఇస్తే.. తాను దళితుడైన అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌ని మంత్రిని చేశానని చెప్పుకొచ్చారు. బీఆర్ఎస్ హయాంలో కల్వకుంట్ల కవితను ఎంపీ చేస్తే తాను మాత్రం ఎస్సీ ఆడబిడ్డ అయిన కడియం కావ్యను పార్లమెంట్‌కు పంపానని వివరించారు. యశస్విని ఎమ్మెల్యేగా అసెంబ్లీకి పంపానని తెలిపారు. కేసీఆర్ తన సడ్డకుని కొడుకు సంతోష్‌రావును ఎంపీ చేస్తే తాము మిత్ర ధర్మం పాటించి వేం నరేందర్‌రెడ్డిని రాజ్యసభకు పంపామని తెలిపారు. ఉద్యమకారుడైన కోదండరామ్‌కి కాంగ్రెస్ ప్రభుత్వం ఎమ్మెల్సీ పదవి ఇచ్చి గౌరవించిందన్నారు. కేసీఆర్ మాత్రం తన కొడుక్కి పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ పదవిని కట్టబెట్టారని ఎద్దేవా చేశారు. జాతీయ పార్టీ అయిన కాంగ్రెస్‌కు తాము బీసీ బిడ్డ అయిన మహేశ్‌కుమార్ గౌడ్‌ను రాష్ట్ర అధ్యక్ష పదవి ఇచ్చి గౌరవించామని అన్నారు. ఈ రకంగా కేసీఆర్ హయాంలో ఆయన కుటుంబానికే న్యాయం జరిగితే తమ పార్టీ హయాంలో సబ్బండ వర్గాలకు అన్ని రకాలుగా న్యాయం జరుగుతుందని సీఎం వివరించారు. **సెప్టెంబర్‌లో అసెంబ్లీ సమావేశాలు..** అసెంబ్లీ సమావేశాలు ఏర్పాటు చేయాలని కేటీఆర్, హరీశ్‌రావు పదే పదే అడుగుతున్నారని, రాష్ట్ర అభివృద్ధిపై సెప్టెంబర్ నెలలో జరిగే అసెంబ్లీ సమావేశాల్లో తేల్చుకుందా మని బీఆర్ఎస్ పార్టీకి సీఎం రేవంత్‌రెడ్డి సవాల్ చేశారు. నా లెక్కలన్నీ పక్కా చెబుతానని, సుమారు ఈ మూడేండ్ల పాలనలో మేం చేసిన అభివృద్ధిని, మీరు చేయలేని పనులను పూర్తిస్థాయిలో చర్చిద్దా మన్నారు. ఈ సమావేశాలకు కేటీఆర్, హరీశ్‌రావులే కాకుండా కేసీఆర్ ను సైతం తీసుకురావాలని కోరారు. ఆయన సలహాలు రాష్ట్ర అభివృద్ధికి ఉపయోగపడతాయని అన్నారు. కేసీఆర్ నాకు రాష్ట్రాన్ని అప్పగించిన సమయంలో 8లక్షల11వేల కోట్ల అప్పులను అప్పగించారని అన్నారు. రాష్ట్రం ఏర్పడినప్పుడు రాష్ట్రంపై రూ.6500కోట్ల అప్పుల భారమే ఉండేదని, కేసీఆర్ అధికారంలోకి వచ్చాక 8లక్షల11వేల కోట్లకు అప్పులు పెరిగాయన్నారు. లక్ష రూపాయలు రుణ మాఫీ చేస్తామని కేసీఆర్ రైతులను మోసం చేశారని తెలిపారు. ఇందిరమ్మ ప్రభుత్వంలో 25లక్షల మంది రైతులకు 2లక్షల రుణమాఫీలో భాగంగా 25వేలా 617కోట్లను రైతుల ఖాతాల్లో వేసి రుణ విముక్తులను చేశామన్నారు. రూ.36వేల కోట్ల నిధులను రైతుభరోసాకు ఇచ్చామన్నారు. ఉచిత విద్యుత్ కోసం రూ.30వేల కోట్లను రైతుల ప్రయోజనార్థం ఖర్చు పెడుతున్నామన్నారు. తమ ప్రభుత్వంలో ఇద్దరు మహిళలకు మంత్రి పదువులు ఇచ్చామన్నారు. కోటి మంది మహిళలను కోటీశ్వర్లను చేయాలనే లక్ష్యంతో పెట్రోల్ పంపులు, సోలార్ ప్లాంట్స్, ఆర్టీసీ బస్సులకు యజమానులుగా చేసిన విషయం వాస్తవం కాదా? అని ప్రశ్నించారు. **కేసీఆర్ ధృతరాష్ట్రుడా ?** కేసీఆర్ బిడ్డ కవితకు ఆస్తిలో భాగం ఇవ్వాల్సి వస్తుందని కర్కోటకుడైన అన్న కేటీఆర్ కవితను మెడలు పట్టి బయటకు నెట్టారని, దీన్ని సరిదిద్దాల్సిన కన్నతండ్రి కేసీఆర్ ధృతరాష్ట్రుడిగా ప్రేక్షకపాత్ర వహించారని రేవంత్‌రెడ్డి ఎద్దేవా చేశారు. కేసీఆర్ ఇచ్చిన బతుకమ్మ చీరెలను ఎన్నడన్న కట్టుకున్నారా..చేండ్లలో అడవి పందులను బయపెట్టడానికి ఆ చీరెలను కట్టారని, కానీ మేము ఇచ్చిన పాలపిట్ట చీరెలు కట్టుకుని వచ్చిన మహిళలకు అన్నగా నేను ఎంతో సంతోష పడుతున్నానని అన్నారు. **నిరుద్యోగులు రెచ్చిపోవ్వొదు** నిరుద్యోగులు రెచ్చగొడితే రెచ్చిపోవద్దని సీఎం రేవంత్‌రెడ్డి హితవు పలికారు. ఇందిరమ్మ రాజ్యంలో ఇప్పటి వరకు 70వేల ప్రభుత్వ ఉద్యోగాలు ఇచ్చామని, పోలీసు నియామకాలకు నోటిఫికేషన్ కూడా వేశామన్నారు. నిరుద్యోగులకు న్యాయం జరగాలనే ఉద్దేశంతో గరిష్ట వయోపరిమితిని కూడా పెంచామని, ఈ విషయాన్ని నిరుద్యోగులు గ్రహించాలని కోరారు. గత పదేండ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం నియమాకాలు చేయలేదన్నారు. నిరుద్యోగులను రెచ్చగొట్టి 1200మంది యువకులు ఆత్మహత్యలు చేసుకోవడానికి కారకులయ్యారని అన్నారు. రెచ్చగొట్టాలి...మంది పిల్లలను చంపగొట్టాలనే విధంగా బీఆర్ఎస్ నేతలు వ్యవహరించారని అన్నారు. తెలంగాణ భవన్‌లో ఇటీవల బీఆర్ఎస్ నేతలు రక్తదాన శిబిరం నిర్వహించారని, ఇందులో కేసీఆర్ గానీ, అతని కుటుంబ సభ్యులు ఎవరూ రక్తదానం చేయలేదన్నారు. కార్యకర్తలు మాత్రం రక్తదానం చేశారని అన్నారు. బీఆర్ఎస్ నేతలు రక్త పిశాచాలుగా మారారని, హరీశ్‌రావు, కేటీఆర్,ఎర్రబెల్లి దయాకర్‌రావు, వినోద్‌రావు, సంతోష్‌రావులు ఎందుకు రక్తదానం చేయలేదని ప్రశ్నించారు. కాకలు తీరిన నాయకుడని చెప్పుకునే ఎర్రబెల్లి దయాకర్‌రావును చిన్న అమ్మాయి యశస్విని 50వేల మెజార్టీతో ఓడించి బండకేసి కొట్టిందన్నారు. ఇది నా విజయమో.. యశస్విని విజయమో కాదని, ఇది ప్రజల విజయమని అన్నారు. రైతు, మహిళల అభివృద్ధి కోసం నిరంతరం పని చేస్తున్నామని, నిండు మనస్సుతో 2029లో భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. **హైదరాబాద్ తర్వాత వరంగల్ నగర అభివృద్ధికి ప్రభుత్వం కృషి : మంత్రి పొంగులేటి** మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ హైదరాబాద్ తర్వాత వరంగల్ నగరాన్ని అభివృద్ధి చేయడానికి సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తుందన్నారు. రూ.300కోట్లకు పైగా ఖర్చు పెట్టి మామునూరులో భూసేకరణ చేసి ఆ భూమిని ఎయిర్‌ఫోర్ట్ అథార్టీ ఆఫ్ ఇండియాకు అందించినట్టు తెలిపారు. రానున్న రెండేండ్లలో ఎయిర్‌ఫోర్ట్ నిర్మాణం పూర్తి చేసి విమానాలు తిరిగేలా చేస్తామన్నారు. గత పదేండ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం దేవాదుల ప్రాజెక్టును నిర్లక్ష్యం చేసిందన్నారు.

# ములుగు జిల్లా సమగ్ర అభివృద్ధి, గిరిజనుల సంక్షేమమే లక్ష్యం

(మొదటి పేజీ తరువాయి)

సాంప్రదాయ డోలు వాయిద్యాల నడుమ సీఎంకు ఘన స్వాగతం పలికారు. సమ్మక్క- సారలమ్మ గద్దెలను దర్శించుకున్న ముఖ్యమంత్రి, రాష్ట్ర ప్రజలు ఆయురారోగ్యాలతో ఉండాలని ప్రార్థించి మొక్కులో భాగంగా నిలువెత్తు బంగారం (బెల్లం) సమర్పించారు. గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో అర్హులైన 24 మంది వితంతువులు, ఒంటరి మహిళలకు ఒక్కొక్కరికి నెలకు రూ.2,016 చొప్పున చేయూత సామాజిక భద్రత పింఛన్ చెక్కులను సీఎం స్వయంగా అందజేశారు. మేడారానికి వచ్చే భక్తుల దాహార్తిని తీర్చేందుకు ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన నూతన తాగునీటి ప్లాంట్‌ను ప్రారంభించారు. ఆలయ ప్రాంగణంలో మొక్క నాటి, పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని గుర్తుచేశారు. ములుగు వేదికగా రాష్ట్రవ్యాప్తంగా రూ.16,007 కోట్లతో చేపట్టనున్న గ్రామీణ రహదారుల అభివృద్ధి పైలాన్‌ను సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు సీతక్క, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డితో కలిసి ఆవిష్కరించారు. దీని ద్వారా రాష్ట్రంలోని 2,145 రహదారులు (మొత్తం 7,448 కి.మీ) అభివృద్ధి చెందనున్నాయి. ములుగు జిల్లా కలెక్టరేట్ సముదాయ ప్రారంభోత్సవం అనంతరం నిర్వహించిన బహిరంగ సభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ... ములుగు జిల్లా సమగ్ర అభివృద్ధి, గిరిజనుల సంక్షేమమే ధ్యేయంగా ప్రజా ప్రభుత్వం పనిచేస్తోందని స్పష్టం చేశారు. మేడారం సమ్మక్క -సారలమ్మ దేవాలయాన్ని రామప్ప, వేయి స్తంభాల గుడి తరహాలో అద్భుతంగా అభివృద్ధి చేస్తామని తెలిపారు. మల్లూరు నరసింహస్వామి దేవాలయ అభివృద్ధికి త్వరలో ప్రత్యేక నిధులు మంజూరు చేస్తామని ప్రకటించారు. జంపన్న వాగుపై చెక్‌డ్యామ్‌లు, స్నాన ఘట్టాల నిర్మాణం చేపట్టి సమగ్ర అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. యువతకు అంతర్జాతీయ స్థాయిలో ఉపాధి కల్పించేందుకు జర్మన్, జపనీస్, కొరియన్ వంటి విదేశీ భాషల్లో ఉచిత శిక్షణ అందించడంతో పాటు, యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలలను ఏర్పాటు చేస్తున్నట్టు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ధనసరి అనసూయ (సీతక్క), అడ్లూరి లక్ష్మణ్, పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. **తెలంగాణ ఆడబిడ్డ అంటూ సీఎం కితాబు** ములుగు కలెక్టరేట్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మంత్రి సీతక్కపై ప్రశంసల జల్లు కురిపించారు. "తెలంగాణ ఆడబిడ్డ" అయిన సీతక్క ములుగు అభివృద్ధికి ఎంతగానో కృషి చేస్తున్నారంటూ ఆమె పనితీరును సీఎం ప్రత్యేకంగా కొనియాడారు. **ప్రజా ప్రభుత్వంలోనే అభివృద్ధి గత పాలకులపై మంత్రి సీతక్క విమర్శలు** గత పాలకులు ఎన్నికల సమయంలో కేవలం శంకుస్థాపనలు చేసి, ఆ తర్వాత నిధులు కేటాయించకుండా పనులను నిలిపివేశారని మంత్రి సీతక్క మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాతే నిలిచిపోయిన పనులను మళ్లీ ముందుకు తీసుకువెళు_న్నామని తెలిపారు. ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలపై కొందరు కావాలనే తప్పుడు ప్రచారం చేస్తున్నారని, ప్రజలు వాటిని నమ్మవద్దని మంత్రి సీతక్క కోరారు. పీసీసీ అధ్యక్షుడిగా ఉన్న సమయంలో రేవంత్ రెడ్డి, స్వర్గీయ నల్లెల్ల కుమారస్వామి చేసిన పోరాటాల ఫలితంగానే ములుగు జిల్లా ఏర్పాటయిందని సీతక్క గుర్తుచేశారు. నేడు అదే జిల్లాను వందల కోట్ల రూపాయలతో అభివృద్ధి చేసే బాధ్యతను సీఎం రేవంత్ రెడ్డి తీసుకున్నారన్నారు.

# లెబనాన్‌పై ఇజ్రాయిల్ భీకర దాడులు

### వైమానిక దాడుల్లో 11 మంది మృతి

### హిజ్బుల్లా దాడులకు ప్రతీకారంగా దాడులు

### లెబనాన్‌కు అండగా ఉంటామన్న ఇరాన్



**నబాటిహ్ ,మన జనప్రగతి ఆగస్టు 16:** లెబనాన్‌పై ఇజ్రాయిల్ సైన్యం విరుచుకుపడింది. దక్షిణ లెబనాన్‌లోని వివిధ ప్రాంతాలపై భీకర వైమానిక దాడులకు పాల్పడింది. ఈ దాడుల్లో 11 మంది మృతిచెందారు. మరో 19 మంది తీవ్రంగా గాయపడ్డారు. చనిపోయిన వారిలో ముగ్గురు చిన్నారులు ఉన్నట్టు అధికారులు తెలిపారు. హిజ్బుల్లా జరిపిన దాడుల్లో తమ దేశానికి చెందిన ముగ్గురు సైనికులు గాయపడినట్టు ఇజ్రాయిల్ డిఫెన్స్ ఫోర్సెస్ (ఐడీఎఫ్) ప్రకటించిన లెబనాన్‌లోని నబాటిహ్ జిల్లాలో గల అన్సార్, డెయిర్ ఎజ్-జహ్రానీ ప్రాంతాలను ఇజ్రాయిల్ యుద్ధ విమానాలు లక్ష్యంగా చేసుకుని శనివారం తెల్లవారుజామున విరుచుకు పడ్డాయి. అన్సార్‌లో ఒక నివాస గృహంపై జరిపిన క్షిపణి దాడిలో ముగ్గురు చిన్నారులతో సహా ఏడుగురు అక్కడికక్కడే మృతి చెందారు. ఇద్దరు గాయపడ్డారు. అలాగే డెయిర్ ఎజ్-జహ్రానీలో జరిగిన మరో వైమానిక దాడిలో నలుగురు ప్రాణాలు కోల్పోయారు. 17 మంది తీవ్రంగా గాయపడినట్లు అంతర్జాతీయ మీడియా రాసుకొచ్చింది. లెబనాన్‌పై దాడులతో పాటు పౌరులు మృతి చెందిన విషయాన్ని ఇజ్రాయిల్ సైన్యం ధ్రువీకరించింది. అయితే, హిజ్బుల్లానే ఉద్దేశపూర్వకంగా ఆ సైనిక శిబిరాల్లో పౌరులను ఉంచిందని ఐడీఎఫ్ ఆరోపించింది. మృతి చెందిన మహిళలు, పిల్లలు ఒక సీనియర్ హిజ్బుల్లా కమాండర్ కుటుంబ సభ్యులని ఇజ్రాయిల్ మీడియా పేర్కొంది.

# ఘనంగా జనని-సూర్యతేజ వివాహం..

(మొదటి పేజీ తరువాయి)

సెంటర్‌లో జరిగిన ఈ వేడుకకు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు తన అర్ధాంగి నారా భువనేశ్వరితో కలిసి విచ్చేశారు.వారు నూతన వధూవరులు జనని, సూర్య తేజ వద్దకు వెళ్లి అక్షింతలు వేసి ఆశీర్వదించారు. వారికి ఉజ్వల భవిష్యత్తు ఉండాలని ఆకాంక్షిస్తూ, బండ్ల గణేశ్ కుటుంబానికి శుభాకాంక్షలు తెలిపారు. కాగా, తన కుమార్తె పెళ్లి వేడుకకు చంద్రబాబు సతీసమేతంగా రావడం పట్ల బండ్ల గణేశ్ తీవ్ర భావోద్వేగానికి లోనయ్యారు. ఓ దశలో ఏడ్చేశారు. దాంతో పక్కనే ఉన్న సీనియర్ నటుడు బ్రహ్మాజీ ఆయనను ఊరడించారు. కాగా, వరుడు సూర్యతేజ సీఎం చంద్రబాబు- నారా భువనేశ్వరిల చేతులమీదుగా తాళి అందుకుని వధువు మెడలో మంగళసూత్రధారణ చేయడం విశేషం. బండ్ల గణేశ్ కు సినీ, రాజకీయ రంగాల్లో మంచి సంబంధాలు ఉన్న నేపథ్యంలో, ఈ వివాహ వేడుకకు ఇరు రంగాలకు చెందిన నాయకులు, నటీనటులు, నిర్మాతలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. వారి రాకతో వివాహ ప్రాంగణం సందడిగా మారింది. అతిథులను బండ్ల గణేశ్ దంపతులు సాదరంగా ఆహ్వానించి, వారి బాగోగులు చూసుకున్నారు. ఈ వివాహ వేడుకకు సంబంధించిన ఫొటోలు, వీడియోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.

# నేటి నుంచి ఏపీ అసెంబ్లీ సమావేశాలు..

(మొదటి పేజీ తరువాయి)

రానుండగా వైసీపీ పార్టీ ఎలాంటి నిర్ణయం ఇంకా తీసుకోలేదు.ఈ సమావేశాలకు హాజరై ప్రజా సమస్యలను ప్రస్తావించాలని స్పీకర్ అయ్యన్నపాత్రుడు మరోసారి వైసీపీ ఎమ్మెల్యేలకు సూచించారు. జగన్ అసెంబ్లీకి వస్తే డీఎస్సీతో సహా పలు అంశాలపై మంత్రులతో సమాధానాలు ఇప్పించే బాధ్యత తీసుకుంటానని వెల్లడించారు. అర్హత లేకుండా ప్రతిపక్ష హోదా ఇవ్వలేనని స్పష్టం చేశారు.

# రష్యాతో బలపడుతున్న సంబంధాలు

(మొదటి పేజీ తరువాయి)

బలపడి అన్ని రంగాలలో సహకారం కొనసాగుతోందని తెలిపారు. న్యాయం కోసం సాగించిన ఉమ్మడి పోరాట చరిత్రను, స్నేహబంధం యొక్క విలువైన సంప్రదాయాలను ముందుకు తీసుకుపోయిన ద్వైపాక్షిక సంబంధాల భవిష్యత్తుపై ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.విమోచన వార్షికోత్సవం సందర్భంగా సద్భావనా పర్యటన కోసం రష్యా నౌక 'పల్లాడా' ఉత్తర కొరియాలోని వాన్సాన్ ఓడరేవుకు చేరుకుంది. ఉత్తర కొరియా ప్రాంతీయ అధికారులు, రష్యా రాయబార కార్యాలయ సిబ్బంది ఆ నౌకకు స్వాగతం పలికారు. ఇదిలావుండగా శాంతియుత సహజీవనం కోసం ఉత్తర కొరియాతో చర్చలు జరపాల్సిన అవసరం ఉన్నదని దక్షిణ కొరియా అధ్యక్షుడు లీ జే మ్యూంగ్ అభిప్రాయపడ్డారు.ఘర్షణల నివారణకు ఉభయ కొరియాల మధ్య రక్షణ చర్యలు అవసరమని సియోల్ విమోచనా దినోత్సవ వేడుకల సందర్భంగా ఆయన అన్నారు. అయితే లీ అభిప్రాయంతో ఉత్తర కొరియా ఏకీభవించలేదు. అమెరికా-దక్షిణ కొరియా సైనిక విన్యాసాలు తనను రెచ్చగొట్టేందుకు ఉద్దేశించినవేనని విమర్శించింది.

# 'కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్' రద్దుపై నేడు నిరసనలు

(మొదటి పేజీ తరువాయి)

ఆదివారం పార్టీ నేతలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మాజీ ప్రజాప్రతినిధులు, రాష్ట్ర జనరల్ బాడీ సభ్యులతో నిర్వహించిన టెలికాన్ఫరెన్స్‌లో కేటీఆర్ ఈ మేరకు దిశానిర్దేశం చేశారు. కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ కేవలం ఒక సంక్షేమ పథకం మాత్రమే కాదనీ, తెలంగాణ పేద కుటుంబాల ఆడబిడ్డల ఆత్మగౌరవమని పేర్కొన్నారు. 2014 అక్టోబర్ 2న ఈ పథకాన్ని ప్రారంభించినప్పటి నుంచి బీఆర్ఎస్ హయాంలో 13 లక్షల మంది ఆడబిడ్డల కుటుంబాలకు రూ.13 వేల కోట్ల మేర ఆర్థిక సహాయం అందిందన్నారు. కోవిడ్ వంటి తీవ్రమైన ఆర్థిక సంక్షోభ సమయంలోనూ పథకాన్ని అపలేదని గుర్తు చేశారు. కల్యాణలక్ష్మి అంశం హైకోర్టు పరిధిలో ఉన్న సమయంలో ప్రభుత్వం వ్యవహరించిన తీరుపై కేటీఆర్ మండిపడ్డారు. నాలుగుసార్లు గడువిచ్చినా ప్రభుత్వం కౌంటర్ ఎందుకు దాఖలు చేయలేదని ప్రశ్నించారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు రూ.లక్షతో పాటు తులం బంగారం ఇవ్వాల్సి వస్తుందనే ఉద్దేశ్యంతోనే కోర్టులో కౌంటర్ దాఖలు చేయలేదని విమర్శించారు. కాంగ్రెస్ చేస్తున్న మోసాన్ని ప్రజలకు తెలియజేసేందుకే నిరసన కార్యక్రమాన్ని చేపట్టినట్టు వివరించారు. పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జీలు స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలతో సమన్వయం చేసుకుని ఆందోళనను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

# నేడు సర్ ముసాయిదా విడుదల

(మొదటి పేజీ తరువాయి)

ఎన్యూమరేషన్ ఫారాలను పూర్తి చేసి నిర్దేశిత గడువు ఆగస్టు 10 వరకు ఎన్నికల సంఘానికి అందజేశారు. అందులో 2002 సర్‌తో మ్యాపింగ్ కాని 89.88 లక్షల మంది, పేరు, ఇంటి పేరు, ఇతర తేడాలతో పాటు సరైన పత్రాలు అందజేయని దాదాపు 50 లక్షల మంది ఓటర్లు కూడా ఉన్నారు. జూన్ 25 నుంచి ఆగస్టు 10 వరకు ఎన్యూమరేషన్ల పంపిణీ, వాటి స్వీకరణ అనంతరం మొత్తం 73,39,234 ఓట్లను ఎన్నికల సంఘం తొలగించింది. అందులో మరణించిన వారు 9,22,230, శాశ్వతంగా వలస వెళ్లిన వారు 45,18,961, ఆచూకీ లభించని ఓటర్లు 11,25,546, ఇప్పటికే ఎన్‌రోల్ అయిన ఓటర్లు 6,70,203, ఇతరులు 1,02,294 మంది ఉన్నారు. నేటి నుంచి సెప్టెంబర్ 16 వరకు నెల రోజుల పాటు అభ్యంతరాలను స్వీకరిస్తారు. అక్టోబర్ 15 వరకు ఓటర్ల నుంచి వచ్చిన అభ్యంతరాలను పరిష్కరించి, 19న తుది ఓటర్ల జాబితాను ఎన్నికల సంఘం విడుదల చేయనుంది.

## తెలంగాణ ఒత్తిడి వల్లే కేంద్రం జనగణనలో కులగణన చేపట్టింది: పొన్నం

(మొదటి పేజీ తరువాయి)

బిసిల జనాభా ఎంత ఉందో తెలుసుకునే ప్రశ్నను ఉంచాలని సూచించారు. దేశంలో ఎవరి జనాభా ఎంత ఉందో తెలిస్తేనే న్యాయం జరుగుతుందని, బిసి అయిన కేంద్రమంత్రి బండి సంజయ్ కూడా స్పందించకపోవడం బాధాకరం అని పొన్నం ప్రభాకర్ ఎద్దేవా చేశారు.

# ఏపీలో ఘోర ప్రమాదం..

### - కాలువలోకి దూసుకెళ్లిన కారు, ముగ్గురు మృతి, మరో ఇద్దరు గల్లంతు

**అమరావతి :మన జనప్రగతి ఆగస్టు 16:** ఏపీలోని పశ్చిమ గోదావరి జిల్లా ఇరగవరం మండలం ఐతంపూడిలాకుల వద్ద విషాదం చోటు చేసుకుంది.ఓగిడి నుంచి తూర్పుగోదావరి జిల్లాలోని పెరవలిలో పెళ్లికి వెళ్లి వస్తుండగా నరసాపురం ప్రమాదవశాత్తు కారు కాల్వలోకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో ఐదుగురు ఇంజినీరింగ్ విద్యార్థులు గల్లంతయ్యారు.వీరిలో లక్ష్మీభాను (18), నాగిరెడ్డి (18), వీరమల్కులసాయి (19) మృతదేహాలు లభ్యం కాగా మరో ఇద్దరు రాజారాం ( 17 ) , సాయిసూర్య(19) గల్లంతయ్యారు. వీరి కోసం గాలింపు చర్యలు మొదలు పెట్టారు. ఈ ప్రమాదం నుంచి ఒక యువకుడు సురక్షితంగా బయటపడ్డాడు.

ఘటనపై ఏపీ మంత్రులు కొలుసు పార్థసారథి, గొట్టిపాటి రవికుమార్ దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుబూతి తెలిపారు. గల్లంతైన ఇద్దరి కోసం గాలింపు ముమ్మరం చేయాలని జిల్లా పోలీసులకు ఆదేశాలు జారీ చేశారు. **మరో ఘటనలో ఇద్దరు ..** పశ్చిమ గోదావరి జిల్లా పాలకోడేరు మండలం వేంద్ర కాలువలో ఈతకు దిగి మరో ఇద్దరు ఇంజినీరింగ్ విద్యార్థులు మృతి చెందారు. మృతులు భీమవరం, పార్వతీపురం మండల వాసులుగా పోలీసులు గుర్తించారు. ఈ ప్రమాదంలో మరో ఇద్దరు విద్యార్థులు సురక్షితంగా బయటపడ్డారు.

# మేడారంలో వనదేవతలకు సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేక పూజలు

### చేయూత పింఛన్ల చెక్కుల పంపిణీ, వాటర్ ప్లాంట్ ప్రారంభం

### మహిళా సంఘాల సభ్యులతో ముఖ్యమంత్రి ముచ్చట







**ములుగు, మన జనప్రగతి ఆగస్టు 16:**రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ఆదివారం ములుగు జిల్లాలోని ప్రముఖ గిరిజన పుణ్యక్షేత్రం మేడారంలో పర్యటించారు. బిచ్కుంద నుంచి ప్రత్యేక హెలికాప్టర్‌లో మేడారం చేరుకున్న ముఖ్యమంత్రికి రాష్ట్ర మంత్రులు, ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు ఘన స్వాగతం పలికారు. ఆలయ ప్రాంగణానికి చేరుకున్న ముఖ్యమంత్రికి గిరిజన పూజారులు సాంప్రదాయ డోలు వాయిద్యాలు, గిరిజన సంప్రదాయాల నడుమ ఘనంగా స్వాగతం పలికారు. మేడారంలోని వనదేవతలు సమ్మక్కసారలమ్మల గద్దెలను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాష్ట్ర ప్రజలు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని వనదేవతలను ప్రార్థించారు. తన మొక్కులలో భాగంగా వనదేవతలకు నిలువెత్తు బంగారం (బెల్లం) సమర్పించారు. **24 మంది మహిళలకు చేయూత పింఛన్ల పంపిణీ**గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో అర్హులైన 24 మంది వితంతువులు, ఒంటరి మహిళలకు చేయూత సామాజిక భద్రత పింఛన్లను ముఖ్యమంత్రి స్వయంగా అందజేశారు. ఒక్కొక్కరికి నెలకు రూ.2,016 చొప్పున అందించే పింఛన్లకు సంబంధించిన చెక్కులను లబ్ధిదారులకు అందించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి తెలిపారు. ఆలయ ప్రాంగణంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మొక్క నాటారు. పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని ఆయన పేర్కొన్నారు. పచ్చదనం పెంపొందించేందుకు ప్రజలు, అధికారులు సమన్వయంతో కృషి చేయాలని సూచించారు. **వాటర్ ప్లాంట్ ప్రారంభం**మేడారానికి వచ్చే భక్తుల దాహార్తిని తీర్చేందుకు ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన తాగునీటి ప్లాంట్‌ను ముఖ్యమంత్రి ప్రారంభించారు. భక్తులకు పరిశుభ్రమైన తాగునీరు అందుబాటులో ఉండేలా అవసరమైన ఏర్పాట్లు చేయాలని అధికారులను సూచించారు. **మహిళా సంఘాల సభ్యులతో సీఎం ముచ్చట**అనంతరం ఆలయ ప్రాంగణంలో స్వయం సహాయక మహిళా సంఘాల సభ్యులతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముచ్చటించారు. మహిళా సంఘాలు చేపడుతున్న కార్యక్రమాలు, వారి ఉపాధి, ఆర్థిక అభివృద్ధికి సంబంధించిన అంశాలను అడిగి తెలుసుకున్నారు. మహిళా సంఘాల సభ్యులతో కలిసి గ్రూప్ ఫోటో దిగారు. అనంతరం ముఖ్యమంత్రి మేడారం నుంచి ములుగుకు తిరుగుపయనమయ్యారు. ఈ పర్యటనలో పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, రాష్ట్ర మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ధనసరి అనసూయ (సీతక్క), అడ్లూరి లక్ష్మణ్, ఎంపీలు వేం నరేందర్ రెడ్డి, కడియం కావ్య, బలరాం నాయక్, ప్రభుత్వ విప్ రామచంద్ర నాయక్, ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, గండ్ర సత్యనారాయణ రావు, నాయని రాజేందర్ రెడ్డి, కోరం కనకయ్య, పాయం వెంకటేశ్వర్లు, తెల్లం వెంకట్రావు, జారే ఆదినారాయణ, మురళి నాయక్, దేవాదాయశాఖ కమిషనర్ హనుమంతరావు, సెర్ప్ సీఈఓ దివ్య, మేడారం ఈఓ వీరస్వామి తదితర ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

# డీసీసీబీ జీఎం పద్మావతికి ఆకుల గాంధీ శుభాకాంక్షలు

### - ప్రభుత్వ ప్రశంసా పత్రం అందుకోవడం అభినందనీయం



**ఖమ్మం, ప్రతినిధి మన జనప్రగతి ఆగస్టు 16:** ఖమ్మం జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ (డీసీసీబీ) అభివృద్ధికి విశేష సేవలందిస్తున్న జనరల్ మేనేజర్ ఆకుల పద్మావతికి ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ప్రశంసా పత్రం అందజేయడంపై మున్నూరు కాపు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆకుల గాంధీ హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పద్మావతికి ఆయన హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. రుణాల పంపిణీ, అడ్వాన్సుల చెల్లింపులు, రుణాల వసూళ్లతో పాటు బ్యాంకు పురోభివృద్ధికి పద్మావతి చేస్తున్న కృషిని ప్రభుత్వం గుర్తించి స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ప్రశంసా పత్రంతో సత్కరించడం అభినంద నీయమని ఆకుల గాంధీ పేర్కొన్నారు. అంగవైకల్యాన్ని సైతం లెక్కచేయకుండా విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేస్తూ డీసీసీబీ ఉన్నతికి ఆమె చేస్తున్న సేవలు ప్రశంసనీయమన్నారు. కష్టపడి పనిచేస్తే ప్రతిభకు గుర్తింపు తప్పక లభిస్తుందనే దానికి పద్మావతి అందుకున్న ప్రశంసా పత్రమే నిదర్శనమని అన్నారు.

# యువశక్తిని నిర్వీర్యం చేస్తున్న పాలకులు

### యువతతోనే సమాజ మార్పు

### సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు

### చింతల వినయ్ నేతృత్వంలో వందలాది మంది సిపిఐలో చేరిక

### పార్టీ జెండా కప్పి సాదరంగా ఆహ్వానించిన నేతలు



**ఖమ్మం ప్రతినిధి,మన జనప్రగతి ఆగస్టు 16:** దేశ జనాభాలో సగ భాగానికి పైగా కలిగిన యువశక్తిని పాలకులు నిర్వీర్యం చేస్తున్నారని సిపిఐ జాతీయ సమితి సభ్యులు, ఏఐవైఎఫ్ రాష్ట్ర మాజీ అధ్యక్షులు బాగం హేమంతరావు ఆరోపించారు. ఉద్యోగ, ఉపాధి రంగాలలో నిర్లక్ష్యం వహించడం జరుగుతుందని ఆయన తెలిపారు. ఆదివారం చింతల వినయ్ ఆధ్వర్యంలో వందలాది మంది యువకులు సిపిఐలో చేరారు. ఎన్టీఆర్ విగ్రహం వద్ద నుంచి ఖానాపురం హవేలీ నాల్గవ డివిజన్ వరకు భారీ ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఖానాపురం హవేలీ సిపిఐ కార్యదర్శి ఏనుగు గాంధీ అధ్యక్షతన జరిగిన సమావేశంలో హేమంతరావు మాట్లాడుతూ... పాలకులు ప్రజలను విస్మరించి పాలన సాగిస్తున్నారని ముఖ్యంగా ఉపాధి కల్పన రంగాలపై వివక్ష ప్రదర్శిస్తున్నారన్నారు. నైపుణ్యత కలిగిన యువతకు సైతం ఉపాధి దొరకడం లేదని నైపుణ్యత లేని వారు ఏదో ఒక రకంగా ఉపాధి పొందెందుకు ప్రయత్నిస్తుంటే పాలకులు రకరకాల చట్టాలతో బతక లేని పరిస్థితిని సృష్టిస్తున్నారని హేమంతరావు తెలిపారు. మోడీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఎక్కడ ఉద్యోగ అవకాశాలు కల్పించకపోగా యావత్ ప్రభుత్వ రంగాన్ని కార్పొరేట్లకు తాకట్టు పెట్టి దేశాన్ని ప్రైవేటీకరణ వైపు పరుగులు పెట్టిస్తున్నారని ఆయన ఆరోపించారు. తనకు ఎదురు లేదనుకుంటున్న మోడీని ఈ దేశ యువశక్తి మెడలు వంచిందని ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద జరిగిన పోరాటంతో మానవ వనరుల శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయక తప్పలేదని ఆయన తెలిపారు. రాజకీయాల్లో అవినీతిపై యువత భగ్గుమంటున్న సమయంలో యువతకు మద్దతుగా నిలుస్తూ యువజన పోరాటాల్లో పాలుపంచుకున్న సిపిఐలో యువకులు చేరడం అభినందనీయమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సైతం ఇచ్చిన హామీలను అమలు చేయడంలో వైఫల్యం చెందిందని హేమంతరావు తెలిపారు. ముఖ్యంగా నిరుద్యోగ భృతి, ఉద్యోగాల కల్పన విషయంలో ఆడిన మాట తప్పిందని ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ అనేక డిక్లరేషన్లు ఇచ్చిందని ఏ డిక్లరేషన్ను అమలు చేసే పరిస్థితిలో ఈ ప్రభుత్వం లేదన్నారు. సిపిఐ ఆధ్వర్యంలో ప్రజల పక్షాన అనేక పోరాటాలను నిర్వహించడం జరుగుతుందన్నారు. ప్రజా సమస్యల పరిష్కారమే ఎజెండాగా పనిచేస్తున్న సిపిఐ ఇటీవల జన చైతన్య యాత్రలు నిర్వహించి ప్రజా ఉద్యమాలకు నూతన జవసత్వాలను తీసుకు వచ్చిందన్నారు. చింతల వినయ్ సహా పార్టీలో చేరిన వారందరిని సిపిఐ సగర్వంగా ఆహ్వానిస్తుందని హేమ ంతరావు తెలిపారు. ఈ సభలో సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్, సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్రెడ్డి తదితరులు ప్రసంగించగా ఆహుతులను హవేలీ సహాయ కార్యదర్శి నానబాల రామకృష్ణ ఆహుతులను వేదికపైకి ఆహ్వానించగా సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు యర్రా బాబు, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పగడాల మల్లేష్, మేకల శ్రీనివాసరావు, యానాలి సాంబశివరెడ్డి, జిల్లా కౌన్సిల్ సభ్యులు వరదా నర్సింహారావు, ఆటో వర్కర్స్ యూనియన్ నాయకులు ప్రతాపనేని ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు. మహేష్, పాల్గొన్నారు.

# కల్లూరులో నేడు ప్రజావాణి

- మండలస్థాయిలోనే ప్రజల సమస్యలకు పరిష్కారం
- 23 ప్రభుత్వ శాఖల అధికారుల హాజరు



**కల్లూరు, మన జనప్రగతి ఆగస్టు 16:**ప్రజల సమస్యలను మండల స్థాయిలోనే పరిష్కరించేందుకు ప్రభుత్వ ఆదేశాల మేరకు నేడు ఆగస్టు17 న కల్లూరు రైతు వేదికలో ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు మండల అభివృద్ధి అధికారి చంద్రశేఖర్ తెలిపారు. ఎంపీడీవో ఆధ్వర్యంలో నిర్వహించే ఈ కార్యక్రమానికి మండల స్థాయిలోని 23 ప్రభుత్వ శాఖలకు చెందిన అధికారులు హాజరుకానున్నారు. ప్రజలు తమ సమస్యలు, అభ్యర్థనలతో అధికారులను నేరుగా కలిసి వినతిపత్రాలు సమర్పించవచ్చని తెలిపారు. ప్రజల నుంచి స్వీకరించే వినతులను ప్రజావాణి పోర్టల్‌లో నమోదు చేసి, వాటి పరిష్కార ప్రక్రియను ఉన్నతాధికారులు పర్యవేక్షిస్తారని పేర్కొన్నారు. ప్రజావాణి పోర్టల్‌ను జిల్లా కలెక్టర్‌తో పాటు రాష్ట్రస్థాయి అధికారులు కూడా పరిశీలించే అవకాశం ఉండటంతో ప్రజల సమస్యలకు మరింత ప్రాధాన్యత లభిస్తుందని చంద్రశేఖర్ తెలిపారు. ఇకపై చిన్నచిన్న సమస్యల పరిష్కారం కోసం దూరభార ప్రయాసలు పడి జిల్లా స్థాయి ప్రజావాణికి వెళ్లాల్సిన అవసరం లేకుండా మండల కేంద్రంలోనే సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చే అవకాశం కల్పిస్తున్నట్లు చెప్పారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావాలని ఆయన కోరారు. ప్రజావాణి కార్యక్రమాన్ని ఏ శాఖా నిర్లక్ష్యం చేయకుండా సంబంధిత అధికారులు ప్రభుత్వ ఆదేశాల మేరకు తప్పనిసరిగా హాజరై ప్రజల వినతులను స్వీకరించి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సూచించారు.

# సండ్ర జన్మదినం సందర్భంగా వాటర్ ట్యాంకర్ ప్రారంభం





**సత్తుపల్లి, మన జనప్రగతి ఆగస్టు 16:** మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య జన్మదిన వేడుకల్లో భాగంగా సత్తుపల్లి మున్సిపాలిటీ 2వ వార్డు కౌన్సిలర్ వీరపనేని రాధికా బాబి ఆధ్వర్యంలో వాటర్ ట్యాంకర్‌ను ప్రారంభించారు. పట్టణంలో మంచినీటి అవసరం ఉన్న ప్రాంతాలకు ఉచితంగా నీటిని సరఫరా చేయాలనే ఉద్దేశంతో ఈ వాటర్ ట్యాంకర్‌ను అందుబాటులోకి తీసుకొచ్చినట్లు రాధికా బాబి తెలిపారు. సత్తుపల్లి పట్టణంలో ఎక్కడ మంచినీటి అవసరం ఉన్నా తమకు సమాచారం అందిస్తే ఉచితంగా వాటర్ ట్యాంకర్ ద్వారా నీటిని సరఫరా చేస్తామని ఆమె పేర్కొన్నారు. ప్రజల మంచినీటి అవసరాలను తీర్చేందుకు ఈ సేవలను వినియోగించుకోవాలని కోరారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్యకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలకు ఉపయోగపడే విధంగా సండ్ర వెంకట వీరయ్య జన్మదిన వేడుకలను సేవా కార్యక్రమాలతో నిర్వహిస్తున్నామని బీఆర్ఎస్ నాయకులు తెలిపారు. పట్టణంలో మంచినీటి అవసరాలు ఉన్న ప్రజలకు వాటర్ ట్యాంకర్ సేవలు అందుబాటులో ఉండటం ద్వారా వేసవి, నీటి కొరత సమయంలో ప్రజలకు కొంతమేర ఉపశమనం కలుగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ కూసంపూడి మహేష్, సత్తుపల్లి మున్సిపాలిటీ వార్డు కౌన్సిలర్లు, పట్టణ బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, సండ్ర వెంకట వీరయ్య అభిమానులు పాల్గొన్నారు.

# సీఎం రేవంత్ రెడ్డి పర్యటనకు శ్రీనగర్ గ్రామ ప్రజల తరలింపు



**మల్లంపల్లి మన జనప్రగతి ఆగస్టు 16:**ములుగులో నూతన సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం (కలెక్టరేట్) ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి హాజరవుతున్న సందర్భంగా శ్రీనగర్ గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో ములుగుకు బయలు దేరారు. ముఖ్యమంత్రి పర్యటనలో భాగంగా నూతన కలెక్టరేట్ ప్రారంభోత్సవంతో పాటు పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టనున్న నేపథ్యంలో కార్యక్రమానికి హాజరయ్యేందుకు శ్రీనగర్ గ్రామం నుంచి ప్రజలు ఉత్సాహంగా తరలివెళ్లారు. గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివెళ్లడంతో శ్రీనగర్‌లో సందడి వాతావరణం నెలకొంది. సీఎం పర్యటన విజయవంతం కావాలని, ములుగు జిల్లా అభివృద్ధికి మరిన్ని నిధులు మంజూరు చేయాలని ప్రజలు ఆకాంక్షించారు. ములుగు జిల్లా అభివృద్ధి, గిరిజన ప్రాంతాల సంక్షేమం, సాగునీరు, విద్య, వైద్యం, రహదారులు, మౌలిక వసతులపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలని శ్రీనగర్ గ్రామ ప్రజలు కోరుతున్నారు.



## నూతన దంపతులను ఆశీర్వదించిన అతికారి కృష్ణ



**సిద్ధవటం, మన జనప్రగతి ఆగస్టు 16:–** మండల కేంద్రమైన సిద్ధవటం బందారు పల్లె ఎస్సీ కాలనీలో ఆదివారం జరిగిన మైలా శ్రీనివాసులుఉషారాణి వివాహ వేడుకల్లో జనసేన పార్టీ రాజంపేట పార్లమెంట్ సమన్వయకర్త అతికారి కృష్ణ పాల్గొని నూతన దంపతులను ఆశీర్వదించారు. ఆయన మాట్లాడుతూ వేద మంత్రోచ్చారణలు, పచ్చని తోరణాల మధ్య వివాహ బంధంతో ఒక్కటైన నూతన దంపతులు సుఖసంతోషాలతో నిండు నూరేళ్లు కలిసిమెలిసి జీవించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఏఎంసీ డైరెక్టర్ మహబూబ్ బాషా, మండల మైనార్టీ నేత షేక్ గౌస్ బాషా, జనసేన పార్టీ నాయకులు పసుపులేటి గంగయ్య, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

## అవార్డుతో బాధ్యత పెరిగింది: ఎస్ఐ సుస్మిత



**వీరబల్లి,మన జనప్రగతి ఆగస్టు16:–** స్వాతంత్ర దినోత్సవ వేడుకల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచినందుకు అవార్డు రావడం తనకి ఇంకా బాధ్యత పెరిగినట్లు అయిందని మండల ఎస్సై సుస్మిత అన్నారు. ఆమె ఆదివారం మన జన ప్రగతి రిపోర్టర్ తో మాట్లాడుతూ స్వాతంత్ర దినోత్సవ వేడుకల్లో అవార్డు రావడంతో తనకు మరింత బాధ్యత పెరిగిందని అన్నారు. తనకు అవార్డు ప్రధానం చేసిన అధికారులకు ఆమె పేరుపేరునా ధన్యవాదాలు తెలిపారు. అలాగే మండలంలో ప్రజలు, నాయకులు కూడా చట్టాన్ని గౌరవిస్తూ ఉండడం తో తాను ప్రజలకు మరింత సేవ చేసేందుకు అనుకూలంగా ఉందని తెలిపారు. తన విధి నిర్వహణలో తనకు పూర్తి సహకారం అందించిన మండల ప్రజలకు నాయకులకు ఈ సందర్భంగా ఆమె ధన్యవాదాలు తెలిపారు.

## నూతన వధూవరులను ఆశీర్వదించిన భూమిరెడ్డి ఉమాదేవి



**కడప మన జనప్రగతి ఆగస్టు 16:–**కడప నగరంలోని రాయచోటి రోడ్డులో గల రాజా రాణి మహల్‌లో సిద్దవటం మార్కెట్ యార్డ్ మాజీ ఛైర్మన్ సయ్యద్ జవహర్ బాషా కుమార్తె వివాహ వేడుక ఘనంగా జరిగింది.ఈ వివాహ మహోత్సవానికి భూమిరెడ్డి ఉమాదేవి ముఖ్య అతిథిగా విచ్చేశారు.కల్యాణ వేదికపై కొలువుదీరిన నూతన వధూవరులను ఆమె కలిసి,పుష్పగుచ్ఛం అందించి మనస్ఫూర్తిగా ఆశీర్వదించారు. అనంతరం సయ్యద్ జవహర్ బాషా తో పాటు వారి కుటుంబ సభ్యులకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ శుభకార్యంలో పలువురు స్థానిక నాయకులు, ప్రముఖులు,బంధుమిత్రులు పెద్ద సంఖ్యలో పాల్గొని నూతన దంపతులకు శుభాశీస్సులు అందజేశారు.

## 2018 గ్రూప్-1 ఫలితాలపై సీబీఐ విచారణకు డిమాండ్



**కడప,మన జనప్రగతి ఆగస్టు 16:–** 2018 గ్రూప్-1 మెయిన్స్, ఇంటర్వ్యూ ఫలితాల్లో జరిగినట్లు ఆరోపిస్తున్న అవకతవకలపై సీబీఐ విచారణ జరిపించాలని కాంగ్రెస్ పార్టీ కడప అసెంబ్లీ సమన్వయకర్త బండి జకరయ్య డిమాండ్ చేశారు.కడపలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ శాఖల్లో ఖాళీ పోస్టులను భర్తీ చేసి, నిరుద్యోగ యువత సమస్యలను పరిష్కరించాలని కోరారు. 2019 నుంచి 2024 వరకు ఏపీపీఎస్సీ నిర్వహించిన పరీక్షలపై సీబీఐ విచారణ జరిపించాలని, ఏపీపీఎస్సీని ప్రక్షాళన చేసి కొత్త చైర్మన్, సభ్యులను నియమించాలని డిమాండ్ చేశారు.అలాగే ఎన్నికల్లో యువతకు ఇచ్చిన హామీలను అమలు చేసి, వెంటనే జాబ్ క్యాలెండర్ ప్రకటించాలని ప్రభుత్వాన్ని కోరారు.

## కె.వి.పల్లి మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్‌కు 'బెస్ట్ స్కాట్ మాస్టర్' మెరిట్ సర్టిఫికెట్ ప్రదానం



**కె.వి.పల్లి మన జనప్రగతి ఆగస్టు 16 :–**కె.వి.పల్లి మండల పరిధిలోని ఆదర్శ పాఠశాల (మోడల్ స్కూల్) ప్రిన్సిపల్ మూడే శీను నాయక్ ఉత్తమ సేవలకు గానూ అరుదైన పురస్కారాన్ని అందుకున్నారు. 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా మదనపల్లెలో నిర్వహించిన అధికారిక కార్యక్రమంలో, స్కౌట్స్ విభాగంలో అందించిన విశేష సేవలకు గుర్తింపుగా ఆయనకు 'బెస్ట్ స్కాట్ మాస్టర్' మెరిట్ సర్టిఫికెట్‌ను రాష్ట్ర రవాణా, యువజన సంక్షేమ శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి చేతుల మీదుగా అందజేశారు.ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మూడే శీను నాయక్ మాట్లాడుతూ... ఈ పురస్కారం తనపై మరింత బాధ్యతను పెంచిందని తెలిపారు. దీనిని స్ఫూర్తిగా తీసుకుని రాబోయే రోజుల్లో స్కౌట్స్ & గైడ్స్ విభాగాన్ని మరింత అభివృద్ధి చేస్తానని పేర్కొన్నారు. విద్యార్థులలో చిన్నతనం నుంచే సేవాభావం, అంకితభావం మరియు దేశభక్తిని పెంపొందించడానికి తన వంతు కృషి చేస్తానని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.ప్రిన్సిపల్ శీను నాయక్‌కు మెరిట్ సర్టిఫికెట్ రావడం పట్ల పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామ ప్రముఖులు మరియు మండల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు.

## నూతన గృహప్రవేశ విందు వేడుకల్లో పాల్గొన్న సుగవాసి ప్రసాద్ బాబు




**రాయచోటి స్టాఫ్ రిపోర్టర్ మన జనప్రగతి ఆగస్టు 16 :–** రాయచోటి పట్టణం సుండుపల్లి రోడ్డులోని పాత మున్సిపాలిటీ ప్రక్క సందులో చార్మినార్ హోటల్ యజమాని ఫరూక్ నూతన గృహప్రవేశం సందర్భంగా ఆదివారం మధ్యాహ్నం నిర్వహించిన విందు కార్యక్రమానికి వారి ఆహ్వానం మేరకు రాజంపేట పార్లమెంట్ టీడీపీ అధ్యక్షులు, టీటీడీ పాలకమండలి మాజీ సభ్యులు, రాయచోటి నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ నాయకులు సుగవాసి ప్రసాద్ బాబు హాజరయ్యారు.ఈ సందర్భంగా ఫరూక్ కుటుంబ సభ్యులు ప్రసాద్ బాబు కి ఘన స్వాగతం పలికి, శాలువా కప్పి సత్కరించారు. అనంతరం సుగవాసి ప్రసాద్ బాబు ఫరూక్ ని అభినందించి, నూతన గృహంలో సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, ఐశ్వర్యం నిండాలని ఆకాంక్షిస్తూ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు.నూతన గృహప్రవేశం సందర్భంగా కుటుంబ సభ్యులతో ఆత్మీయంగా ముచ్చటించి, వారి ఆతిథ్యాన్ని స్వీకరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, ఫరూక్ కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు పాల్గొని నూతన గృహప్రవేశ వేడుకను ఆనందోత్సాహాలతో నిర్వహించారు.

## సినిమా హీరోగానే కాదు సమాజ సేవకుడిగా చిరంజీవి స్ఫూర్తి



**రాజమహేంద్రవరం,మన జనప్రగతి ఆగస్టు 16:–** మెగాస్టార్, పద్మవిభూషణ్ డాక్టర్ చిరంజీవి సినిమా హీరోగానే కాకుండా సమాజ సేవకుడిగా లక్షలాది మందికి స్ఫూర్తిగా నిలిచారని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు.చిరంజీవి జన్మదినం సందర్భంగా రాజమహేంద్రవరంలోని జనసేన పార్టీ నగర కార్యాలయంలో నిర్వహించిన భారీ స్వచ్ఛంద రక్తదాన శిబిరాన్ని మంత్రి ప్రారంభించారు. అనంతరం కేక్ కట్ చేసి చిరంజీవికి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. రక్తదానం చేసిన దాతలను, నిర్వాహకులను అభినందించి జ్ఞాపికలు, ప్రశంసా పత్రాలు అందజేశారు.చిరంజీవి ఇచ్చిన "రక్తదానం చేయండి ప్రాణదాతలు కండి" పిలుపును అభిమానులు, జనసేన శ్రేణులు ఏళ్లుగా ఆచరిస్తూ సమాజ సేవలో ముందుండటం అభినందనీయమన్నారు. అత్యవసర సమయాల్లో రక్తం అందించి ప్రాణాలను కాపాడే రక్తదాన శిబిరాలు ఎంతో విలువైనవని పేర్కొన్నారు.ఈ సందర్భంగా చిరంజీవి నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో ఆనందంగా ఉండాలని మంత్రి ఆకాంక్షించారు. రాజకీయాల్లో క్రమశిక్షణ, సంస్కారం, సద్విమర్శలకు ప్రాధాన్యత ఇవ్వాలన్న డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ సూచనలను జనసేన శ్రేణులు పాటిస్తున్నాయని తెలిపారు.

## రైతుల పంటల బీమాపై తప్పుడు ప్రచారం చేయొద్దు: మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు



**అమరావతి,మన జనప్రగతి ఆగస్టు 16:–** రైతులకు మేలు చేయాలనే ఉద్దేశంతో ప్రభుత్వం పంటల బీమా నమోదు చేపడితే దానిపై తప్పుడు ప్రచారం చేయడం సరికాదని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉన్న నేపథ్యంలో ప్రతి రైతుకూ బీమా రక్షణ కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు.ఖరీఫ్-2026లో పంటల బీమా దరఖాస్తులు 35.17 లక్షలకు చేరాయని, గత ఏడాదితో పోలిస్తే సుమారు 80 శాతం పెరిగాయని తెలిపారు. బీమా విస్తీర్ణం 7.83 లక్షల హెక్టార్ల నుంచి 15.17 లక్షల హెక్టార్లకు పెరిగిందని, దేశంలో బీమా విస్తీర్ణంలో ఆంధ్రప్రదేశ్ 5వ స్థానంలో నిలిచిందన్నారు.రైతులు చెల్లించే ప్రీమియం కేవలం 0 నుంచి 2 శాతం మాత్రమేనని, మిగిలిన మొత్తాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు భరిస్తాయని మంత్రి తెలిపారు. బీమా నమోదు రైతుల సమ్మతితోనే జరిగిందని స్పష్టం చేశారు.గత ప్రభుత్వం చెల్లించాల్సిన సుమారు రూ.1,990 కోట్ల ప్రీమియం బకాయిలపై విమర్శలు చేస్తున్న వారు సమాధానం చెప్పాలని అచ్చెన్నాయుడు డిమాండ్ చేశారు. రైతులకు గరిష్ఠ బీమా రక్షణ కల్పించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు.

## డిసిసి ఉపాధ్యక్షుడిగా కొత్వాల్ మహమ్మద్ రఫీ



**రాయచోటి స్టాఫ్ రిపోర్టర్ జనప్రగతి ఆగస్టు 16 :–**రాయచోటి పట్టణానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కొత్వాల్ మహమ్మద్ రఫీ ని డిసిసి ఉపాధ్యక్షుడిగా నియమిస్తూ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు గాజుల భాస్కర్ ఉత్తర్వులు ఇచ్చారు.ఈ మేరకు ఆయన స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నియామక పత్రాన్ని మహమ్మద్ రఫీ కి అందజేశారు.కొత్వాల్ మొహమ్మద్ రఫీ గత 20 సంవత్సరాలుగా కాంగ్రెస్ పార్టీలో కొనసాగుతూ రాష్ట్ర మైనార్టీ వైస్ చైర్మన్ గా,ఉమ్మడి కడప జిల్లా జాయింట్ సెక్రటరీగా,పీసీసీ సభ్యులుగా పనిచేసి పార్టీ అభ్యర్థుల విజయానికి పార్టీ బలోపేతానికి నిరంతరం కృషి చేశారు.ఈ క్రమంలో డిసిసి ఉపాధ్యక్షులుగా ఎన్నికైన సందర్భంగా రఫీ మాట్లాడుతూ నాపై ఎంతో నమ్మకంతో జిల్లా ఉపాధ్యక్షుడు పదవి బాధ్యతలను అప్పగించిన కాంగ్రెస్ పెద్దలకు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.అలాగే గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం దేశానికి,రాష్ట్రానికి చేసిన అభివృద్ధి,సంక్షేమ కార్యక్రమాల గురించి విస్తృత స్థాయిలో ప్రచారం చేయడంతో పాటు అభివృద్ధి సంక్షేమ పథకాల సమాచారాన్ని ప్రజలలోకి తీసుకెళ్తూ,అన్ని నియోజక వర్గాలలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి నా వంతు కృషి చేస్తానని చెప్పారు.అలాగే నాకు ఈ పదవి రావడానికి సహకరించిన జాతీయ కాంగ్రెస్ పార్టీ అగ్ర నాయకులు రాహుల్ గాంధీ,ఏపీసీసీ అధ్యక్షురాలు షర్మిలా రెడ్డి,కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మీడియా చైర్మన్ తులసి రెడ్డి,డిసిసి అధ్యక్షులు గాజుల భాస్కర్ లకు ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు.

## తిరుమలలోఈ నెలలో రెండుసార్లు స్వామివారి గరుడ వాహన సేవ



**తిరుమల,మన జనప్రగతి ఆగస్టు 16:–** తిరుమల శ్రీవారి భక్తులకు టీటీడీ శుభవార్త అందించింది. ఈ నెలలో రెండుసార్లు శ్రీ మలయప్పస్వామివారు గరుడ వాహనంపై తిరుమాడ వీధుల్లో విహరించి భక్తులకు దర్శనమివ్వనున్నారు.ఆగస్టు 17న గరుడ పంచమి సందర్భంగా రాత్రి 7 నుంచి 9 గంటల వరకు శ్రీ మలయప్పస్వామివారు తనకు ఇష్టమైన గరుడ వాహనంపై తిరుమాడ వీధుల్లో ఊరేగి భక్తులను అనుగ్రహించనున్నారు. గరుడ పంచమిని ప్రతి ఏటా తిరుమలలో ఘనంగా నిర్వహిస్తారు.అలాగే ఆగస్టు 28న శ్రావణ పౌర్ణమి సందర్భంగా కూడా గరుడ సేవ నిర్వహించనున్నారు. ఆ రోజు రాత్రి 7 నుంచి 9 గంటల మధ్య స్వామివారు గరుడ వాహనంపై భక్తులకు దర్శనమివ్వనున్నారు.ఒకే నెలలో రెండుసార్లు గరుడ వాహన సేవలు జరగనుండటంతో శ్రీవారి భక్తుల్లో ఆనందం నెలకొంది. ఈ విశేష సేవలను వీక్షించేందుకు పెద్ద సంఖ్యలో భక్తులు తిరుమలకు తరలిరానున్నారు.

## సర్దార్ గౌతు లచ్చన్న ఆశయాలను కొనసాగించాలి

**- కేఆర్‌సీసీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ చంద్రశేఖర్ రెడ్డి**



**మదనపల్లె,మన జనప్రగతి ఆగస్టు 16:–** అన్నమయ్య జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సర్దార్ గౌతు లచ్చన్న జయంతి వేడుకలను జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని పి జి ఆర్ ఎస్ సమావేశ మందిరంలో ఘనంగా నిర్వహించారు. కేఆర్‌సీసీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ చంద్రశేఖర్ రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి, సర్దార్ గౌతు లచ్చన్న చిత్రపటానికి పూలమాల వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ స్వాతంత్ర్య సమరయోధుడిగా, బడుగు బలహీన వర్గాల హక్కుల కోసం పోరాడిన మహనీయుడిగా గౌతు లచ్చన్న చిరస్మరణీయులన్నారు. విద్య, సామాజిక సమానత్వం, వెనుకబడిన వర్గాల అభ్యున్నతికి ఆయన చేసిన సేవలు నేటి తరానికి స్ఫూర్తిదాయకమన్నారు. లచ్చన్న ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.కార్యక్రమంలో జిల్లా బీసీ సంక్షేమ, సాధికారిత అధికారి పి. తేజస్విని, జిల్లా గౌడ సంఘం అధ్యక్షులు శ్రీనివాసులు, మదనపల్లె తాలూకా గౌడ సంఘం అధ్యక్షులు కె. కృష్ణయ్య గౌడ్, ప్రధాన కార్యదర్శులు తుమ్మల దేవేంద్ర గౌడ్, జగిలేటి మురళీధర్ గౌడ్, లక్ష్మీపతి గౌడ్, గౌడ సంఘ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## బలహీన వర్గాల కోసం చివరి శ్వాస వరకు శ్రమించిన యోధుడు గౌతు లచ్చన్న



**రాజమహేంద్రవరం మన జనప్రగతి ఆగస్టు 16:–** బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం చివరి శ్వాస వరకు పోరాడిన స్వాతంత్ర్య సమరయోధుడు సర్దార్ గౌతు లచ్చన్న జీవితం ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు.సర్దార్ గౌతు లచ్చన్న 117వ జయంతి సందర్భంగా రాజమహేంద్రవరం వై-జంక్షన్ వద్ద ఉన్న ఆయన విగ్రహానికి మంత్రి దుర్గేష్ పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ 1932లో ఉప్పు సత్యాగ్రహం, శాసనోల్లంఘన ఉద్యమాల్లో పాల్గొని జైలు శిక్ష అనుభవించిన లచ్చన్న స్వాతంత్ర్య ఉద్యమంలో కీలక పాత్ర పోషించారని గుర్తుచేశారు.స్వాతంత్ర్యానికి ముందు, ఆ తర్వాత తెలుగునాట రాజకీయాలను ప్రభావితం చేసిన అరుదైన నాయకుడిగా లచ్చన్న నిలిచారని, పార్టీలకు అతీతంగా వెనుకబడిన వర్గాల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేశారని తెలిపారు. వికేంద్రీకరణ, చిన్న రాష్ట్రాల ఏర్పాటుకు ఆయన అప్పట్లోనే మద్దతు తెలిపారని పేర్కొన్నారు.గౌతు లచ్చన్న జయంతిని రాష్ట్ర అధికారిక కార్యక్రమంగా నిర్వహిస్తున్న కూటమి ప్రభుత్వానికి మంత్రి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో గౌడ, శెట్టిబలిజ, ఈడిగ, శ్రీశైన, యాత సంక్షేమ సంఘాల ప్రతినిధులు, విగ్రహ ఆవిష్కరణ కమిటీ సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.

మనజనప్రగతి

17- 08 - 2026

# నగరంలో పారిశుద్ధ్యం మొదటి ప్రాధాన్యతగా పనులు చేయండి: కమిషనర్ ఎం.జయకృష్ణ



**తిరుపతి మన జనప్రగతి ఆగస్టు 16:-** నగరంలో పారిశుద్ధ్య పనులకు మొదటి ప్రాధాన్యత ఇస్తూ మరింత మెరుగ్గా పనులు చేపట్టాలని, ప్రతి ఉద్యోగి చిత్తశుద్ధి తో విధులు నిర్వహించాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎం.జయకృష్ణ సిబ్బందికి సూచించారు. ఆదివారం ఉదయం నగరంలోని న్యూ మారుతి నగర్, రాయల్ నగర్, వైకుంఠపురం, మహిళా విశ్వావిద్యాలయం, ఎల్.ఎస్.నగర్, బాలాజీ కాలనీ, మహతి ఆడిటోరియం తదితర ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనులను కమిషనర్ పరిశీలించారు. న్యూ బాలాజీ కాలనీలోని చెత్త తరలింపు కేంద్రాన్ని పరిశీలించి రికార్డులను పరిశీలించారు. ఎన్ని వాహనాలు వస్తున్నాయి, ఎంత చెత్త తరలిస్తున్నారు వంటి వివరాలు పక్కాగా నమోదు చేయాలని సిబ్బందిని ఆదేశించారు. నగరంలోని చెత్త కుప్పలు ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని తెలిపారు. కాలువల్లో చెత్త లేకుండా చూడాలని, డివైడర్ల మధ్య, కూడళ్ళలో ఎండిన మొక్కలు, చెత్త తొలగించి శుభ్రంగా ఉంచాలని తెలిపారు. విధులను దైవంగా భావించి చిత్తశుద్ధితో పని చేయాలని సిబ్బందికి సూచించారు. నగరపాలక సంస్థ కార్యాలయం ఆవరణలో పిచ్చి మొక్కలు తొలగించి శుభ్రంగా ఉంచాలని, అధికారులు, సిబ్బంది, ప్రజల వాహనాలను ఒక క్రమపద్ధతిలో ఉండేలా చూడాలని సిబ్బందిని ఆదేశించారు. కమిషనర్ వెంట హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, మేనేజర్ హాసీమ్, పారిశుద్ధ్య సిబ్బంది ఉన్నారు.

# గౌతు లచ్చన్న స్ఫూర్తితో కూటమి పాలన: మంత్రులు



**విజయవాడ, మన జనప్రగతి ఆగస్టు 16:-** సర్దార్ గౌతు లచ్చన్న స్ఫూర్తితో కూటమి ప్రభుత్వం బీసీల అభ్యున్నతికి ప్రాధాన్యత ఇస్తోందని మంత్రులు సవిత, అనగాని సత్యప్రసాద్, కొల్లు రవీంద్ర, కొలుసు పార్థసారథి, అచ్చెన్నాయుడు అన్నారు. గౌతు లచ్చన్న 117వ జయంతి సందర్భంగా విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో రాష్ట్ర స్థాయి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహానికి మంత్రులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. స్వాతంత్ర్య ఉద్యమంతో పాటు బీసీలు, రైతులు, కార్మికుల హక్కుల కోసం లచ్చన్న చేసిన పోరాటం భావితరాలకు ఆదర్శమని పేర్కొన్నారు. బీసీలకు సామాజిక, ఆర్థిక, రాజకీయంగా మరింత ప్రాధాన్యత కల్పించడమే సీఎం చంద్రబాబు లక్ష్యమని మంత్రులు తెలిపారు. బీసీ యువత విద్య, ఉపాధి, సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందన్నారు. బీసీల ఐక్యతను దెబ్బతీసే ప్రయత్నాల పట్ల అప్రమత్తంగా ఉండాలని మంత్రి పార్థసారథి సూచించారు. కార్యక్రమంలో భాగంగా గౌడ సామాజిక వర్గానికి చెందిన ప్రతిభావంతులైన 125 మంది విద్యార్థులకు రూ.25 లక్షల నగదు పురస్కారాలను మంత్రులు అందజేశారు. కార్యక్రమంలో పలువురు ఎమ్మెల్యేలు, బీసీ సంక్షేమ శాఖ అధికారులు, వివిధ బీసీ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

# బలిజ భవన్ కల్యాణ మండపం ప్రారంభం



**నెల్లూరు, మన జనప్రగతి ఆగస్టు 16:-** నెల్లూరు బాలాజీనగర్‌లో బలిజ, కాపు, తెలగ సంఘం ఆధ్వర్యంలో నిర్మించిన బలిజ భవన్ కల్యాణ మండపాన్ని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ, ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్, టీటీడీ మాజీ చైర్మన్ చదలవాడ కృష్ణమూర్తి, మాజీ ఎమ్మెల్సీ మాదాసు గంగాధరంతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి నారాయణ మాట్లాడుతూ భవన్ నిర్మాణానికి సహకరించిన సంఘ పెద్దలు, దాతలను అభినందించారు. భవన్ నిర్మాణానికి తాను రూ.55 లక్షలు, చదలవాడ కృష్ణమూర్తి రూ.33 లక్షలు, డీవీఎస్ గిరి రూ.18 లక్షలు అందించారని తెలిపారు. కాపు భవన్ నిర్మాణానికి కూడా రూ.2 కోట్ల సహాయం అందించినట్లు చెప్పారు. బలిజ భవన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలను మంత్రి ప్రశంసించారు. 'బలిజ భవన్ భరోసా', 'అమృత కలశం' ద్వారా పేద కుటుంబాలకు నిత్యావసర సరుకులు అందించడం, విద్యార్థులకు ఆర్థిక సహాయం, మహిళలకు ఉచిత కుట్టు శిక్షణ వంటి కార్యక్రమాలు అభినందనీయమన్నారు. బలిజ భవన్ భవిష్యత్ తరాలకు సామాజిక, సాంస్కృతిక, సేవా కేంద్రంగా ఎదగాలని మంత్రి ఆకాంక్షించారు. కాపు యువత విద్య, ఉద్యోగ, వ్యాపార రంగాల్లో రాణించేలా సంఘాలు ప్రోత్సహించాలని సూచించారు. కార్యక్రమంలో పలువురు కాపు నేతలు, బలిజ భవన్ కమిటీ సభ్యులు, సంఘ ప్రతినిధులు పాల్గొన్నారు.

# సామాన్య కుటుంబం నుంచి సర్దార్ స్థాయికి ఎదిగిన లచ్చన్న జీవితం ఆదర్శం



**విజయవాడ, మన జనప్రగతి ఆగస్టు 16:-** సర్దార్ గౌతు లచ్చన్న జీవితం భవిష్యత్ తరాల నాయకులకు స్ఫూర్తిదాయకమని రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. విజయవాడ తుమ్మలపల్లి క్షేత్రయ్య కళాక్షేత్రంలో నిర్వహించిన లచ్చన్న 117వ జయంతి వేడుకల్లో మంత్రి పాల్గొని ఆయన విగ్రహానికి పుష్పాంజలి ఘటించారు. సామాన్య కుటుంబంలో జన్మించిన లచ్చన్న స్వాతంత్ర్య ఉద్యమంలో కీలక పాత్ర పోషించి, బలహీన వర్గాల హక్కుల కోసం జీవితాంతం పోరాడారని కొనియాడారు. కూటమి ప్రభుత్వం బీసీల సంక్షేమం, అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తోందని మంత్రి తెలిపారు. బీసీ రక్షణ చట్టం తీసుకురావడంతో పాటు స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు పునరుద్ధరించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. కల్లుగీత కార్మికుల సంక్షేమానికి కూడా ప్రభుత్వం చర్యలు చేపడుతోందని, ప్రమాదాల్లో మృతి చెందిన కార్మికుల కుటుంబాలకు పరిహారం అందిస్తున్నామని తెలిపారు. గౌతు లచ్చన్న ఆశయాల సాధనకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి స్పష్టం చేశారు. కార్యక్రమంలో మంత్రులు సవిత, అనగాని సత్యప్రసాద్, కొలుసు పార్థసారథి, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారానికై కలసికట్టుగా పనిచేద్దాం: కమిషనర్ ఎం.జయకృష్ణ




**తిరుపతి మన జనప్రగతి ఆగస్టు 16:-** ప్రజా సమస్యల పరిష్కారం, నగర అభివృద్ధికి అన్ని విభాగాల అధికారులు కలసికట్టుగా పనిచేయాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎం.జయకృష్ణ అధికారులకు సూచించారు. నూతన కమిషనర్ గా బాధ్యతలు చేపట్టిన జయకృష్ణ ఆదివారం మధ్యాహ్నం అన్ని విభాగాల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలో ప్రజల నుండి వచ్చే అన్ని వినతులకు సరైన పరిష్కారం చూపేందుకు ప్రతి అధికారి పనిచేయాలని తెలిపారు. ప్రతి విభాగంలోని అధికారులు మీ విభాగంలో ఉన్న పనులకు కాలపరిమితి పెట్టుకుని ఎప్పటికప్పుడు పరిష్కరించాలని తెలిపారు. ప్రతి సమస్య పరిష్కారం అర్జీదారుడు సంతృప్తి పడేలా ఉండాలని తెలిపారు. ప్రతి ఉద్యోగి తాను నిజాయితీగా చేసిన పనిని గర్వంగా కుటుంబసభ్యులకు, స్నేహితులకు చెప్పుకునేలా విధులు నిర్వహించాలని తెలిపారు. అభివృద్ధి పనులను మరింత వేగవంతం చేయాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. నగరంలో ప్రభుత్వ భూములు ఆక్రమణలకు గురి కాకుండా చూడాలని తెలిపారు. నగరంలో అక్రమ నిర్మాణాలు జరగకుండా ప్లానింగ్ అధికారులు, సిబ్బంది పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. నగరంలో పారిశుధ్య పనులు ప్రజలందరూ మెచ్చేలా చేయాలని ఆరోగ్య శాఖ అధికారులను ఆదేశించారు. నగరంలో అభివృద్ధి పనులకు నిధులు సమకూరేలా అన్ని రకాల పన్నులు సకాలంలో వసూలు చేయాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. అన్ని విభాగాల అధికారులు, సిబ్బంది సమన్వయం చేసుకుని సకాలంలో పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ 2026 ను పారదర్శకంగా త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ఈ సమీక్షా సమావేశంలో అదనపు కమిషనర్ శారదా దేవి, డిప్యూటీ కమిషనర్ అమరయ్య, స్మార్ట్ సిటీ జనరల్ మేనేజర్ చంద్రమౌళి, ఈ.ఈ.రవి, మునిసిపల్ ఇంజినీర్లు తులసికుమార్, గోమతి, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, రెవెన్యూ అధికారులు సేతు మాధవ్, రవి, డిసిపీ దేవి కుమారి, ఏసీపీలు పార్వతిప్రియ, మూర్తి, వెటర్నరీ ఆఫీసర్ గుణశేఖర్, ఉద్యానవన శాఖాధికారి హరికృష్ణ, ఫైర్ ఆఫీసర్ ప్రవీణ్, ఈ డిటి సుధాకర్ నాయక్, డి.ఈ లు, శానిటరీ సూపర్ వైజర్లు, మెప్మా అధికారులు, సూపరింటెండెంట్లు, తదితరులు ఉన్నారు.

# కన్వీనర్ కోటా సీట్లపై అదనపు ఫీజుల దందా ఆపాలి: పీడీఎస్‌యూ



**కడప మన జనప్రగతి ఆగస్టు 16 :-** కన్వీనర్ కోటాలో ఇంజినీరింగ్ సీట్లు పొందిన విద్యార్థుల నుంచి హాస్టల్, బస్, డొనేషన్, కోచింగ్ తదితర పేర్లతో అదనపు ఫీజులు వసూలు చేస్తున్న ప్రైవేట్ కాలేజీలపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం. అంకన్న డిమాండ్ చేశారు. ఆదివారం పీడీఎస్‌యూ రాయలసీమ ప్రాంతీయ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ కన్వీనర్ కోటా సీట్లకు అదనపు ఫీజులు చెల్లించాల్సిందేనంటూ విద్యార్థులు, తల్లిదండ్రులపై ఒత్తిడి చేయడం దారుణమన్నారు. పేద, మధ్యతరగతి విద్యార్థులపై అదనపు ఆర్థిక భారం మోపడం వారి విద్యా హక్కులను హరించడమేనని పేర్కొన్నారు. ప్రైవేట్ ఇంజినీరింగ్ కాలేజీలపై ప్రత్యేక తనిఖీలు నిర్వహించి, అక్రమంగా వసూలు చేసిన మొత్తాలను విద్యార్థులకు తిరిగి ఇప్పించాలని కోరారు. కన్వీనర్ కోటా సీట్ల పేరుతో అదనపు ఫీజులు వసూలు చేయకుండా ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను సకాలంలో విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ జిల్లా నగర నాయకులు దుర్గేష్, ఖాసీం తదితరులు పాల్గొన్నారు.

# రూ.40 లక్షలతో సిద్ధి వినాయక ఆలయ పునఃనిర్మాణానికి భూమిపూజ



**నెల్లూరు, మన జనప్రగతి ఆగస్టు 16:-** నెల్లూరు 50వ డివిజన్ బుజ్జమ్మ రేవు సమీపంలోని సిద్ధి వినాయక ఆలయ పునఃనిర్మాణానికి మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ, సతీమణి రమాదేవితో కలిసి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు ఆలయ పునఃనిర్మాణానికి రూ.40 లక్షల సహాయం అందిస్తున్నట్లు తెలిపారు. ఆలయ నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేసి భక్తులకు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. అలాగే స్థానిక రజకుల కోరిక మేరకు సమీపంలోని చాకలి రేవులో మిగిలిన గదుల నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేయాలని మున్సిపల్ కమిషనర్‌ను ఆదేశించారు. కార్యక్రమంలో మేయర్ సుజాత, కమిషనర్ నందన్, డిప్యూటీ మేయర్ రూప్ కుమార్ యాదవ్, కపిర శ్రీనివాసులు, కపిర రేవతి తదితరులు పాల్గొన్నారు.

# గౌతు లచ్చన్నకు జిల్లా పోలీసుల ఘన నివాళి



**కడప, మన జనప్రగతి ఆగస్టు 16:-** స్వాతంత్ర్య సమరయోధుడు, ప్రజాసేవకుడు, రైతుకూలీల హక్కుల కోసం పోరాడిన డాక్టర్ సర్దార్ గౌతు లచ్చన్న 117వ జయంతి సందర్భంగా వైఎస్సార్ కడప జిల్లా పోలీసులు ఘన నివాళులర్పించారు. జిల్లా ఎస్పీ షెల్కె నచికేత్ విశ్వనాథ్ ఐపీఎస్ ఆదేశాల మేరకు జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏఆర్ అదనపు ఎస్పీ బి. రమణయ్య గౌతు లచ్చన్న చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రమణయ్య మాట్లాడుతూ ప్రజల పక్షాన నిలబడి, రైతులు, కూలీల సంక్షేమం కోసం లచ్చన్న చేసిన పోరాటం స్ఫూర్తిదాయకమన్నారు. ఆయన ఆశయాలు, విలువలు నేటికీ ఆదర్శనీయమని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ పి. నాగేశ్వరరావు, ఆర్ఐలు, ఆర్ఎస్ఐలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# నేడు సేద్యపు ఎద్దుల విభాగం పోటీలు

**కడప మన జనప్రగతి ఆగస్టు :-** కడప నగరం రామచంద్రపురం దగ్గర లో ఉన్న విద్య నగర్ కాలనీ సాక్షి సర్కిల్ పులివెందుల రోడ్డు నందు శ్రీ శివపార్వతుల నూతన విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం శుభ సందర్భంగా నేడు సేద్యపు ఎద్దుల పోటీలు ఏర్పాటు చేయడం జరిగిందని శివపార్వతుల కమిటీ సభ్యులు తెలిపారు. సేద్యపు ఎద్దుల విభాగం పోటీలలో గెలుపొందిన వారికి ఒకటవ బహుమతి 30 వేల రూపాయలు, బహుమతి 25 వేల రూపాయలు, ఇప్పుడు బహుమతి 20 వేల రూపాయలు, నాలుగో బహుమతి 15 రూపాయలు, 5వ బహుమతి 10 వేల రూపాయలు, 6వ బహుమతి 5 వేల రూపాయలు ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. శ్రీ శివపార్వతుల విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవంలో భక్తులందరూ పాల్గొని కరుణ కటాక్షం తీసుకోవాలని కోరారు.

# రౌడీ షీటర్లకు పోలీసులు కౌన్సిలింగ్



**కర్నూలు బ్యూరో మన జనప్రగతి ఆగస్ట్ 16:-** కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆదేశాల మేరకు జిల్లాలో నేరనియంత్రణ , శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా పోలీసు అధికారులు అన్ని పోలీసు స్టేషన్ల పరిధిలో రౌడీ షీటర్లకు , నేరచరిత్ర గలవారికి , చెడు నడత కలిగిన వ్యక్తులకు కౌన్సిలింగ్ నిర్వహించారు. సత్ప్రవర్తనతో జీవించాలని, నేర ప్రవృత్తికి స్వస్తి పలకాలని, చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని సూచించారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలలో పాల్గొంటే తప్పనిసరిగా చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని పోలీసు అధికారులు హెచ్చరించారు.

# నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

**మదనపల్లి,మన జనప్రగతి ఆగస్టు 16:-** ప్రజల సమస్యలను స్వీకరించి పరిష్కరించేందుకు ఆగస్టు 17న సోమవారం ఉదయం 10 గంటల నుంచి ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెస్సల్ సిస్టం) నిర్వహించనున్నట్లు అన్నమయ్య జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ శివ్ నారాయణ శర్మ తెలిపారు. అన్నమయ్య జిల్లా కేంద్రం మదనపల్లితో పాటు గ్రామ, మండల, డివిజన్ స్థాయిలో ఈ కార్యక్రమం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ప్రజలు తమ అర్జీలను కలెక్టరేట్‌కు రావాల్సిన అవసరం లేకుండా meekosam.ap.gov.in వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవచ్చన్నారు. అర్జీల నమోదు, వాటి ప్రస్తుత స్థితి తదితర వివరాల కోసం 1100 మీకోసం కాల్ సెంటర్ను సంప్రదించవచ్చని తెలిపారు. ప్రజలు ముందుగా తమ సమస్యలను గ్రామ, మండల, డివిజన్ స్థాయి అధికారులకు అందజేయాలని, అక్కడ పరిష్కారం కాని సమస్యలతో మాత్రమే జిల్లా కేంద్రంలో జరిగే ప్రజా సమస్యల పరిష్కార వేదికకు రావాలని ఇన్‌చార్జి కలెక్టర్ సూచించారు.

# చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు

## - రౌడీ షీటర్లకు ముద్దనూరు సి.ఐ కౌన్సిలింగ్



**కడప మన జనప్రగతి ఆగస్టు 16:-** జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ ఆదేశాల మేరకు ముద్దనూరు సి.ఐ నగేష్ బాబు ఆధ్వర్యంలో పోలీస్ స్టేషన్ పరిధిలోని రౌడీ షీటర్లను స్థానిక పోలీస్ స్టేషన్‌కు పిలిపించారు. వారికి కౌన్సెలింగ్ నిర్వహించి, సమాజంలో శాంతి భద్రతలకు విఘాతం కలిగించకుండా మంచి ప్రవర్తనతో ఉండాలని కఠినంగా హెచ్చరించారు. అలాగే భవిష్యత్తులో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు, గొడవలు లేదా చట్ట విరుద్ధ కార్యకలాపాల్లో పాల్గొనరాదని స్పష్టంగా సూచించారు. పోలీసుల హెచ్చరికలను గౌరవిస్తూ మంచి ప్రవర్తన కొనసాగించాలని వారికి తెలియజేశారు.

# సీఐ మహానందికి ఎమ్మార్పీఎస్ నేతల సన్మానం



**ఉరవకొండ మన జనప్రగతి ఆగస్టు 16:-** ఉరవకొండ సర్కిల్ ఇన్స్పెక్టర్ (సీఐ) మహానంది అనంతపురం జిల్లా ఎస్పీ చేతుల మీదుగా 'ఉత్తమ సీఐ' అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా ఆదివారం ఎమ్మార్పీఎస్ నాయకులు ఆయనను కలిసి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు కొత్తకోట ఎర్రస్వామి, జిల్లా కార్యదర్శి మాదిగ ఎల్లప్ప, మరియు మీనుగ రమేష్ బాబు తదితరులు పాల్గొని సీఐకి శుభాకాంక్షలు తెలిపారు.

## జూడాల సమస్యలు పరిష్కరించి సమ్మె విరమించేలా చర్యలు తీసుకోవాలి



**అమరావతి,మన జనప్రగతి ఆగస్టు 16:-** ఆంధ్రప్రదేశ్‌లో జూనియర్ డాక్టర్లు చేపట్టిన ఆందోళనపై ప్రభుత్వం తక్షణమే స్పందించి, వారితో చర్చలు జరిపి న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడు, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్‌ను కోరారు.జూడాలు స్టైఫండ్ పెంపు, ప్రభుత్వ ఆసుపత్రుల్లో మౌలిక వసతులు, వైద్యుల భద్రత, మెరుగైన పని వాతావరణం వంటి సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చారని తెలిపారు. పెరిగిన పని భారం, ద్రవ్యోల్బణాన్ని దృష్టిలో ఉంచుకుని స్టైఫండ్ పెంచాలని కోరారు.జూడాల ఆందో ళనతో నాన్-ఎమర్జెన్సీ వైద్య సేవలకు అంతరాయం ఏర్పడి రోగులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ఆగస్టు 17 నుంచి ఆందోళనను తీవ్రతరం చేస్తామని జూడాలు ప్రకటించిన నేపథ్యంలో సీఎం వెంటనే జోక్యం చేసుకుని చర్చలు జరిపి సమస్యను సామరస్యంగా పరిష్కరించాలని ఈశ్వరయ్య విజ్ఞప్తి చేశారు.

## రాకెట్ల తండాలో ఉచిత వైద్య శిబిరం



**ఉరవకొండమన జనప్రగతి ఆగస్టు 16:-**ఉరవకొండ మండలం రాకెట్ల తండాలో కీర్తిశేషులు సీపీఐ సీనియర్ నాయకులు కామ్రేడ్ వాలే నాయక్, సాలమ్మ జ్ఞాపకార్థం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. వారి మనుమరాలు డాక్టర్ భానుప్రియ ఆధ్వర్యంలో జరిగిన ఈ శిబిరంలో పేదలు, గిరిజనులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు.కామ్రేడ్ వాలే నాయక్ కుమారుడు విజయ్ భాస్కర్, కోడలు మాధవి, కుమార్తె సీతమ్మ, అల్లుడు రాములు నాయక్ సహకారంతో ఈ సేవా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులు మాట్లాడుతూ వాలే నాయక్, సాలమ్మలు పేదలు, గిరిజనుల హక్కుల కోసం జీవితాంతం కృషి చేశారని గుర్తుచేశారు. వారి ఆశయాలను కొనసాగిస్తూ ప్రజలకు ఉపయోగపడే సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తాతయ్య జ్ఞాపకార్థం తమ గ్రామ ప్రజలకు వైద్య సేవలు అందించడం అభినందనీయమని రాకెట్ల తండా గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. పేదల ఆరోగ్యానికి అండగా నిలిచిన ఈ కార్యక్రమం మానవత్వానికి ప్రతీకగా నిలిచిందన్నారు.

## నేడు పీజీఆర్ఎస్ కార్యక్రమం

**కడప,మన జనప్రగతి ఆగస్టు 16:-** జిల్లా ప్రజల సమస్యల పరిష్కారం కోసం నేడు ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు కలెక్టరేట్ సభాభవన్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) నిర్వహించనున్నట్లు డీఆర్వో మల్లికార్జునుడు తెలిపారు. జిల్లా కేంద్రంతో పాటు డివిజన్, మండల, మున్సిపల్ స్థాయిల్లో కూడా ఈ కార్యక్రమం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ప్రజలు తమ సమస్యలతో హాజరై వినతిపత్రాలు సమర్పించాలని కోరారు. అలాగే గతంలో సమర్పించిన అర్జీల వివరాలు తెలుసుకోవడానికి 1100 కాల్ సెంటర్ సేవలను వినియోగించుకోవచ్చని, పాత అర్జీలకు సంబంధించిన రసీదు ఉంటే వెంట తీసుకురావాలని సూచించారు.

## వేంపల్లెలో ఘనంగా కేజ్రీవాల్ పుట్టినరోజు వేడుకలు



**వేంపల్లె మన జనప్రగతి ఆగస్టు 16:-** వేంపల్లె లో ఆదివారం ఆమ్‌ఆద్మీ పార్టీ.అధినేత, ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రివాల్ పుట్టినరోజు వేడుకలను ఆ పార్టీ నేతలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన కేకును రహంతుల్లా తనయుడు అజాన్ తో కత్తిరించి కార్యకర్తలకు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాజీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ ఎంతో కష్టపడి పార్టీని స్థాపించి ఢిల్లీని నడిపించారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీజిల్లా కో-కన్వీనర్ దాదా పీర్, వేంపల్లి మండల సభ్యులు పీరుబాషా, మహమ్మద్, గౌస్,అనిల్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

## బడుగుల బాంధవుడు గౌతు లచ్చన్న: అచ్చెన్నాయుడు



**విజయవాడ, మన జనప్రగతి ఆగస్టు 16 :-** బడుగు, బలహీన వర్గాల హక్కుల కోసం జీవితాంతం పోరాడిన స్వాతంత్ర్య సమరయోధుడు సర్దార్ గౌతు లచ్చన్న అని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు కొనియాడారు.విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో నిర్వహించిన గౌతు లచ్చన్న రాష్ట్ర స్థాయి జయంతి వేడుకల్లో మంత్రి పాల్గొని నివాళు లర్పించారు. ప్రజా సమస్యల పరిష్కారం, సామాజిక న్యాయం, బీసీల హక్కుల కోసం లచ్చన్న చేసిన పోరాటం భావితరాలకు స్ఫూర్తిదాయకమన్నారు.బీసీలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందేందుకు విద్యకు ప్రాధాన్యత ఇవ్వాలని మంత్రి సూచించారు. ఈ సందర్భంగా అనగాని సత్యప్రసాద్ ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో టెన్త్, ఇంటర్‌లో ప్రతిభ కనబరిచిన గౌడ సామాజిక వర్గానికి చెందిన 125 మంది విద్యార్థులకు రూ.25 లక్షల నగదు పురస్కారాలు అందజేశారు.విద్యార్థులు అవకాశాలను సద్వినియోగం చేసుకుని ఉన్నత స్థానాలకు ఎదగాలని మంత్రి ఆకాంక్షించారు. గౌతు లచ్చన్న పోరాట స్ఫూర్తిని కొనసాగించడమే ఆయనకు నిజమైన నివాళి అని అచ్చెన్నాయుడు పేర్కొన్నారు.

## జాతికి స్ఫూర్తి.. సర్దార్ డా. గౌతు లచ్చన్న



**కడప మన జనప్రగతి ఆగస్టు 16:-** అట్టడుగు, వెనుకబడిన వర్గాల అభ్యున్నతికి విశేష కృషి చేసిన స్వాతంత్ర్య సమరయోధుడు సర్దార్ డా. గౌతు లచ్చన్న జాతికి స్ఫూర్తిదాయకమని జిల్లా రెవెన్యూ అధికారి కె. మల్లికార్జునుడు అన్నారు.కడప కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాలులో ఆదివారం బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో గౌతు లచ్చన్న 117వ జయంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఆర్వో మాట్లాడుతూ.. స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొన్న లచ్చన్న ఉప్పు సత్యాగ్రహం, క్విట్ ఇండియా ఉద్యమాల్లో చురుకుగా పాల్గొని జైలు శిక్ష అనుభవించారని తెలిపారు.అంటరానితనం, సామాజిక వివక్షకు వ్యతిరేకంగా పోరాడిన ఆయన హరిజన సేవాసంఘం ద్వారా రాత్రి పాఠశాలలు నిర్వహించారని, రైతులు, కార్మికులు, వెనుకబడిన వర్గాల హక్కుల కోసం నిరంతరం పోరాడారని పేర్కొన్నారు. ఎమ్మెల్యే, ఎంపీగా కూడా ప్రజలకు సేవలందించారని తెలిపారు.లచ్చన్న సేవలను గుర్తిస్తూ ఆయన జయంతిని రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పండుగగా ప్రకటించడం గర్వించదగ్గ విషయమన్నారు. కార్యక్రమానికి ముందు డీఆర్వో, అధికారులు లచ్చన్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.కార్యక్రమంలో బీసీ సంక్షేమ శాఖ అధికారి కృష్ణ, స్టెప్ సీఈవో ప్రసాద్, వివిధ బీసీ సంఘాల నాయకులు, సంక్షేమ శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## భాగవత సప్తాహంలో పాల్గొన్న తులసి రెడ్డి

**తొండూరు మన జనప్రగతి ఆగస్టు 16:-** తొండూరు మండలం, మదూరు గ్రామంలో శ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వామి దేవస్థానం నందు 16 -08-26 ఆదివారం నుండి 22 -08-26 శనివారం వరకు మదూరు గ్రామ ప్రజలు,భక్తాదుల చేత భాగవత సప్తాహ శ్రవణ యజ్ఞము ఏర్పాటు చేయడమైనది. తొలి రోజు ఆదివారం రాజ్యసభ మాజీ సభ్యులు, ప్రముఖ ఆధ్యాత్మికవేత్త డాక్టర్ నరెడ్డి తులసి రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా తులసి రెడ్డి మాట్లాడుతూ ఆధునిక మానవుడు అన్నీ ఉండి కూడా అశాంతితో అలమటిస్తున్నాడన్నారు. ఈ నేపథ్యంలో ఆధ్యాత్మిక క్షేత్రాలు, భాగవత సప్తాహం లాంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు,ఆధ్యాత్మికవేత్తలు, భాగవతులతో సమాలోచనలు ఆధునిక మానవునికి ప్రశాంతిని కలిగిస్తాయన్నారు.మన పురాణ ఇతిహాసాలు సమాజానికి నిత్య దిక్సూచికలు. రామాయణం ఒక ఆదర్శ శాస్త్రం.మహాభారతం ధర్మార్థ కామ మోక్షాలను వివరించే ధర్మశాస్త్రం. భాగవతం ఒక మోక్ష శాస్త్రం. శ్రీమన్నారాయణు ని దశావతారాల వర్ణనా వైభవమే మహాభాగవతం.ప్రహ్లాదుడు, ధృవుడు ముచి కుందుడు, అంబరీషుడు,కుచేలుడు, గజేంద్రుడు తదితర భాగవతోత్తముల గాథల ద్వారా ఆధ్యాత్మిక జ్ఞానాన్ని అందించే మోక్షశాస్త్రం భాగవతం అన్నారు.భాగవతాన్ని భక్తిశ్రద్ధలతో పటించినా,ఆలకించినా మోక్ష ప్రాప్తి కలుగుతుందని ప్రతీతి.కలియుగ ఆరంభంలో గంగా నది తీరాన శుక మహర్షి అధ్యక్షతన పరీక్షిత్తు మహారాజు మొట్టమొదటిసారి భాగవత సప్తాహం కార్యక్రమాన్ని నిర్వహించారని, దీనివల్ల పరీక్షిత్తుకు మోక్ష ప్రాప్తి లభించిందని ప్రతీతి. అటువంటి మంచి కార్యక్రమాన్ని మదూరు గ్రామంలో నిర్వహించడం చాలా అభినందనీయమని తులసి రెడ్డి అన్నారు.ఈ కార్యక్రమంలో ప్రముఖ ఆధ్యాత్మికవేత్తలు తేరా పుల్లారెడ్డి, మీడియా ఇంచార్జ్ యాగంటి బాలకృష్ణారెడ్డి,భాగవతులు పెద్దరామయ్య,విజయ శంకర్, వెంకట శేషయ్య, విజయ్ గోపాల్, నవమోహన్,కృష్ణారెడ్డి, కొండయ్య,అమర్నాథ్ రెడ్డి,ఉత్తన్న, ఐచర్ రమణ,చిన్నకోట్ల నాగరాజు,పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.





## పిజిఆర్ఎస్ సేవలపై క్యూ.ఆర్ కోడ్ ద్వారా స్పందన తెలియజేయండి

● జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి



**కడప,మన జనప్రగతి ఆగస్టు 16 :-** ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పి.జి.ఆర్.ఎస్) ద్వారా అందుతున్న సేవలపై ప్రజలు తమ స్పందన తెలియజేయాలని జిల్లా కలెక్టర్ డా శ్రీధర్ చెరుకూరి ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా మరింత పారదర్శకత, జవాబుదారీతనంతో కూడిన సేవలను అందించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం నిరంతర అభిప్రాయ సేకరణ చేసి ప్రజల సంతృప్తి స్థాయిని మెరుగుపరచడం, వ్యవస్థను బలోపేతం చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రజల అభిప్రాయాలను కోరుతుందన్నారు. పిజిఆర్ఎస్ కేంద్రాలను సందర్శించే పౌరుల నుండి అభిప్రాయాన్ని సేకరించేందుకు జిల్లా, మండల స్థాయి పిజిఆర్ఎస్ కేంద్రాలలో, వివిధ మాధ్యమాల్లో ప్రజల అభిప్రాయ సేకరణకు క్యూ ఆర్ కోడ్‌ను ప్రదర్శించాలని నిర్ణయించడం జరిగిందన్నారు. జిల్లా, మండల స్థాయి పిజిఆర్ఎస్ కేంద్రాల ప్రవేశ, నిష్క్రమణ ప్రాంతాలలో ప్రజలకు స్పష్టంగా కనిపించేలా క్యూ.ఆర్ కోడ్ ప్రముఖంగా ప్రదర్శించాలని ఆదేశించారు. క్యూ. ఆర్ కోడ్‌ను స్పష్టంగా, కంటికి కనిపించే పరిమాణంలో ముద్రించి, ప్రజలకు సులభంగా అందుబాటులో ఉండే ప్రాంతాలలో ఏర్పాటు చేయాలని స్పష్టం చేశారు. పౌరులు పిజిఆర్ఎస్ సేవలను పొందిన వెంటనే తమ మొబైల్ ఫోన్‌ల ద్వారా క్యూ.ఆర్ కోడ్‌ను స్కాన్ చేసి తమ అభిప్రాయాన్ని తెలియజేయవచ్చన్నారు. . ఎక్కువ సంఖ్యలో పౌరులు భాగస్వామ్యం అయ్యే విధంగా నోటీసు బోర్డులు, హెల్ప్ డెస్క్‌లు, ఫిర్యాదుల కౌంటర్లు, తదితర ప్రదేశాల్లో పెట్టాలని కలెక్టర్ సూచించారు. అర్జీల స్థితిగతులు తెలుసుకొనుటకు టోల్ ఫ్రీ నంబర్ 1100 కు ఫోన్ చేసి తెలుసుకోవచ్చని తెలిపారు. పి.జి.ఆర్.ఎస్ ను వినియోగించుకోవాలని, తమ అభిప్రాయాలను తెలియజేస్తూ మరింత మెరుగైన సేవలు అందించుటకు సహకరించాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. ప్రతీ సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలోను, మండల కార్యాలయాల్లోనూ నిర్వహించే పి.జి.ఆర్.ఎస్ లో అర్జీలు అందించండి, వాటిపై మీ స్పందన క్యూ.ఆర్ కోడ్ ద్వారా తెలియజేయండి అని కలెక్టర్ డా శ్రీధర్ చెరుకూరి ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

## 19న వేంపల్లెలో జిల్లా స్థాయి యోగా పోటీలు

**వేంపల్లె మన జనప్రగతి ఆగస్టు 16:-**

వైస్సార్ కడప జిల్లా యోగా స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 19న వేంపల్లి లో జిల్లా స్థాయి యోగా పోటీలు నిర్వహిస్తున్నట్లు రాయలసీమ యోగా స్పోర్ట్స్ ఇన్‌ఛార్జ్ మనోహర రెడ్డి,జిల్లా సెక్రటరీ తేజ, జాయింట్ సెక్రటరీ షఫీ తెలిపారు. వేంపల్లెలో ఆదివారం వారు విలేకరులతో మాట్లాడారు. ఈ పోటీలు స్థానిక వైయస్సార్ వివేకానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఉంటాయని వారు వెల్లడించారు. బాల,బాలికలు, స్త్రీ, పురుషులకు వయసు విభాగాల వారీగా ఈ పోటీలు నిర్వహిస్తామన్నారు. సబ్ జూనియర్, జూనియర్, సీనియర్ విభాగాల కింద వయసు వారిగా ఈ పోటీలు నిర్వహిస్తామన్నారు. సీనియర్ కింద45 ఏళ్లకు అంతకు మించి సంవత్సరాలు పైన వయస్సు కలవారు 31.12.1981 లోపు పుట్టిన వారు రూ 100 రూపాయలు ప్రవేశ రుసుము చెల్లించి, ఆధార్ కార్డు జిరాక్స్ , పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోలు తమ వెంట తెచ్చుకోవాలని తెలిపారు.సిలబస్, ఇతర వివరాలకు 9398014919, 9440470064 ఫోన్ చేసిఆసక్తి గల క్రీడాకారులు తమ పేర్లను నమోదు చేసుకోవా లని వారు కోరారు. ఈ పోటీలలో ఎంపికైన వారు ఈ నెల 29,30 తేదీలలో విశాఖపట్నం లో జరబోయే రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొంటారని వారు వెల్లడించారు.

## వేముల మండల ప్రజల సుఖదుఃఖాల్లో ఎంపీ అవినాష్ రెడ్డి

● నూతన వధూవరులకు ఆశీస్సులు ● బాధిత కుటుంబ సభ్యులకు ఓదార్పు ● అనారోగ్యంతో ఉన్న మహిళను పరామర్శ



**వేముల మన జనప్రగతి ఆగస్టు 16:-**వేముల "మండలం ప్రజల సుఖదుఃఖాల్లో కడప పార్లమెంట్ సభ్యులు వైఎస్ అవినాష్ రెడ్డి భాగస్వామ్యమయ్యారు" . ఆదివారం వేముల మండలంలో పలు కార్యక్రమాల్లో పాల్గొన్న ఆయన..ఓ వైపు వివాహ వేడుకకు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించగా..మరోవైపు బాధిత కుటుంబాలను పరామర్శించి ధైర్యం చెప్పారు.మండలంలోని నల్లచెరువుపల్లి గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు వర్ర వీరభాస్కర్ రెడ్డి కుమారుడు అశోక్ రెడ్డి, పల్లవి వివాహం మోపూరు భైరవేశ్వర స్వామి దేవస్థానం వద్ద ఘనంగా జరిగింది. ఈ వివాహ వేడుకకు ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి, వేముల మండల కన్వీనర్ నాగెళ్ల సాంబశివరెడ్డితో కలిసి హాజరయ్యారు. నూతన వధూవరులను ఆశీర్వదించి, వారి దాంపత్య జీవితం సుఖసంతోషాలతో సాగాలని ఆకాంక్షించారు.అనంతరం నారేపల్లె గ్రామానికి చెందిన పార్టీ నాయకులు డి. మురళీమోహన్ రెడ్డి కుమారుడు అశోక్ రెడ్డి (7) ఇటీవల ఆర్ఎంపీ వైద్యుడు చేసిన చికిత్స వికటించి మృతి చెందిన విషయం తెలుసుకున్న ఎంపీ అవినాష్ రెడ్డి..మురళీమోహన్ రెడ్డి కుటుంబాన్ని పరామర్శించారు.కుటుంబ సభ్యులను ఓదార్చి ధైర్యంగా ఉండాలని సూచించారు. ఈ కష్ట సమయంలో కుటుంబానికి అన్ని విధాలా అండగా ఉంటానని మురళీమోహన్ రెడ్డికి భరోసా కల్పించారు.అదే గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు వెంకట శివారెడ్డి భార్య అనారోగ్యంతో బాధపడుతున్న విషయం తెలుసుకున్న ఎంపీ ఆమెను పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని,ధైర్యంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమాల్లో స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు,కార్యకర్తలు మరియు అభిమానులు పాల్గొన్నారు.



మనజనప్రగతి
17- 08 - 2026

## సీఎం రేవంత్ రెడ్డి ని హెలిప్యాడ్ వద్ద పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి ఘనంగా స్వాగతం పలికారు



**తొర్రూరు మన జనప్రగతి ఆగస్టు 16:** ఉమ్మడి వరంగల్ జిల్లా ములుగు ,పరకాల నియోజకవర్గాల పర్యటనకు ఆదివారం సీఎం రేవంత్ రెడ్డి పర్యటన కొరకు వచ్చారు. ఆ సమయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని తెలిపారు వద్ద కలిసి ఘన స్వాగతం పలికిన పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని ముఖ్యమంత్రికి పుష్పవృక్షాన్ని అందజేసి శుభాకాంక్షలు తెలిపారు అనంతరం సీఎం తో మర్యాదపూర్వకంగా మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## సంక్షేమ పాఠశాల ఆకస్మిక తనిఖీ



**మానకొండూర్ మన జనప్రగతి ఆగస్టు 16:** మానకొండూర్ మండలం దేవంపల్లి గ్రామంలోని సాంఘీక సంక్షేమ పాఠశాలను మానకొండూర్ ఎమ్మెల్యే, టీపీసీసీ ఎస్సీ సెల్ చైర్మన్ డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థులకు అందుతున్న విద్య, వసతులు, భోజనం తదితర అంశాలను పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో మౌలిక వసతులు, పరిశుభ్రత, విద్యార్థుల సౌకర్యాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సంబంధిత అధికారులకు సూచించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన వసతులు అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని ఎమ్మెల్యే తెలిపారు.

## మేడారం సమ్మక్కసారలమ్మ తల్లులను దర్శించుకొని ప్రత్యేక పూజలు చేసిన ఎమ్మెల్యే





**తొర్రూరు ప్రతినిధి, మన జనప్రగతి ఆగస్టు 16:** తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ములుగు పరకాల పర్యట నిమిత్తం జరిగింది. సీఎం రేవంత్ రెడ్డికి ఘన స్వాగతం పలికిన అనంతరం ఎమ్మెల్యే యశస్విని రెడ్డి ములుగు జిల్లాలోని సమ్మక్క దేవతలను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అమ్మవార్ల ఆశీస్సులు రాష్ట్ర ప్రజలందరిపై ఉండాలని, తెలంగాణ రాష్ట్రం మరింత అభివృద్ధి పథంలో ముందుకు సాగాలని, ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆమె ఆకాంక్షించారు. అనంతరం ఆలయ పూజారుల ఆశీర్వాదాలు స్వీకరించారు.

## ఉత్తమ ఉద్యోగిగా నల్లగట్ల మారేశ్వరరావు

**సత్తుపల్లి, మన జనప్రగతి ఆగస్టు 16:** స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని సత్తుపల్లి టీజీఎస్ఆర్టీసీ డిపోలో నిర్వహించిన అభినందన కార్యక్రమంలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఉద్యోగులకు నగదు, బహుమతి పురస్కారాలను డిపో మేనేజర్ గురజాల లక్ష్మీనారాయణ అందజేశారు. ఈ సందర్భంగా సత్తుపల్లి డిపో కండక్టర్ నల్లగట్ల మారేశ్వరరావు అత్యధిక ఎర్నింగ్ పర్ కిలోమీటర్ (ఈపీకే) సాధించి బెస్ట్ ఎంప్లాయ్‌గా ఎంపికయ్యారు. అలాగే వి. రవి, ఎన్. లక్ష్మయ్యలు బెస్ట్ డ్రైవర్లుగా ఎంపికయ్యారు. వీరికి డిపో మేనేజర్ లక్ష్మీనారాయణ చేతుల మీదుగా నగదు ప్రోత్సాహకాలు, బహుమతి పురస్కారాలు అందజేశారు. ఈ సందర్భంగా డిపో మేనేజర్ మాట్లాడుతూ ఉద్యోగులు తమ విధుల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచేలా ప్రోత్సహించేందుకు ప్రతి సంవత్సరం స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఉత్తమ ఉద్యోగులను గుర్తించి నగదు, బహుమతి పురస్కారాలు అందజేస్తున్నామని తెలిపారు. ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించడంలో ఉద్యోగుల కృషి అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఎంఎఫ్ఎస్ సాహితీ, స్టేషన్ మాస్టర్ జె. ఆనందం, ఆర్టీసీ సిబ్బంది పాల్గొన్నారు.



## మహాత్మా నగర్ స్వయంభూ శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి 22వ వార్షిక బ్రహ్మోత్సవాలు ఈనెల22 నుండి..

### ఆహ్వాన పత్రం, వాల్ పోస్టర్ లను ఆవిష్కరించిన ఆలయ కమిటీ....



**తిమ్మాపూర్ మన జనప్రగతి ఆగస్టు 16:** కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం, మహాత్మ నగర్ (ఎల్.ఎండి.కాలనీ) లో వెలసిన స్వయంభూ శ్రీశ్రీశ్రీ తాపాలలక్ష్మీ నరసింహ స్వామి వారి 22వ వార్షిక బ్రహ్మోత్సవాలు ఈనెల 22 నుండి ప్రారంభమవుతాయని, బ్రహ్మోత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించడానికి తగిన ఏర్పాట్లు చేస్తున్నట్లు దేవాలయ కమిటీ అధ్యక్షులు ఇనుకొండ నాగేశ్వర్ రెడ్డి తెలిపారు. ఆదివారం రోజున దేవాలయ కమిటీ అధ్యక్షులుఇనుకొండ నాగేశ్వర్ రెడ్డి, పాలకమండలి సభ్యులతో కలిసి దేవాలయ వార్షికోత్సవానికి సంబంధించిన ఆహ్వాన పత్రికలను, వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్రహ్మోత్సవాలు ఈనెల 22 శనివారం నుండి 28 శుక్రవారం వరకు జరుగుతాయన్నారు. ఈనెల 22 నుండి 23 ఆదివారం వరకు అధ్యయనోత్సవాలు, 24 తేదీ సోమవారం రోజున రక్షాబంధనము, గరుడ పటాధివాసము, యజ్ఞం ప్రారంభం, 25 తేదీ రోజున మంగళవారం రోజున హోమము, 24 గంటల నిరంతర భజన కార్యక్రమం, 26 తేదిన బుధవారం రోజున నిత్యపూర్ణాహుతి అనంతరం మధ్యాహ్నం గం. 12-15 నిVలకు అభిజిత్ లగ్నంలో శ్రీ లక్ష్మీనరసింహ స్వామి వారి కళ్యాణ మహోత్సవం నేత్రపర్వంగా నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. తదనంతరం సామూహిక అష్టాదశ ఆరాధన కార్యక్రమం , అలాగే సాయంత్రం గం. 6-00 గంటలకు లక్ష్మీపూజ, సామూహిక కుంకుమార్చనలు, హోమధూము, నిత్యపూర్ణాహుతి, 27 తేదీ గురువారం రోజున ఉదయం గం. 9-00 గంటలకు శ్రీ సుదర్శన నారసింహ హోమము , 28 తేదీ శుక్రవారం రోజున ఉదయం గం. 9-00 గంటలకు శేషాహోమము, మహాపూర్ణాహుతి, బలిహారణం, చక్రతీర్థం, ఆరగింపు, రాత్రి గం. 7-00 గంటలకు శ్రీ పుష్పయాగం, ధ్వజారోహణము, సప్త వర్ణములు, ఉద్వాసన బలి, గ్రామబలి, ఆరగింపు ఏకాంతసేవతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయని తెలిపారు .ఈ వేడుకలకు భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి స్వామివారి కృపకు పాత్రులు కావాల్సిందిగా చైర్మన్ ఇనుకొండ నాగేశ్వర్ రెడ్డి, ఆలయ కమిటి , అర్చకులు కోరారు. ఈ కార్యక్రమంలో దేవాలయ కమిటీ బాధ్యులు కేతిరెడ్డి ఎల్లారెడ్డి, పెండ్యాల కొండల్ రెడ్డి,గూడ కమలాకర్ ,గాదే వెంకటపతి, గొంటుకు కనకయ్య,కేతిరెడ్డి నారాయణ రెడ్డిదొనపాటి రాజిరెడ్డి, ముయిగంటి రాజేందర్ , కొండ్ర రాజు, బొమ్మరవేని బాలకృష్ణ, కన్నం సాయికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## మానేరు డ్యాం వద్ద ఘనంగా గంగమ్మ బోనాల జాతర..

### - ముఖ్య అతిథిగా హాజరైన నగర మేయర్ కొలగాని శ్రీనివాస్..







**కరీంనగర్ జిల్లా మన జనప్రగతి ఆగస్టు 16:** కరీంనగర్ పట్టణ గంగపుత్ర (బెస్త) సంఘం ఆధ్వర్యంలో మానేరు డ్యాం వద్ద గంగమ్మ తల్లికి బోనాల జాతరను అత్యంత వైభవంగా నిర్వహించారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు జరిగిన ఈ జాతరకు భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై గంగమ్మ తల్లికి బోనాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ పవిత్ర గంగమ్మ బోనాల జాతరకు కరీంనగర్ నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరై గంగమ్మ తల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవారి దివ్య ఆశీస్సులు, తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. ఈ సందర్భంగా గంగపుత్ర సంఘం ప్రతినిధులు మేయర్ కొలగాని శ్రీనివాస్ ని సాదరంగా ఆహ్వానించి ఘనంగా సత్కరించారు. గంగమ్మ తల్లి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని మేయర్ ఆకాంక్షించారు. గంగమ్మ బోనాల జాతర సందర్భంగా భక్తులు భక్తిశ్రద్ధలతో అమ్మవారికి బోనాలు సమర్పించగా, మానేరు డ్యాం పరిసర ప్రాంతం ఆధ్యాత్మిక వాతావరణంతో సందడిగా మారింది. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు పెద్దపల్లి శ్రీలేఖ జితేందర్, నాంపల్లి రేణుక శ్రీనివాస్‌లి, కో-ఆప్షన్ సభ్యులు బల్వీర్ సింగ్, పట్టణ గంగపుత్ర సంఘం నగర అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శి నాగుల రాజారాం, కోశాధికారి గడప నర్సింహస్వామి, ఉపాధ్యక్షులు, సంయుక్త కార్యదర్శులు, ఇతర కార్యవర్గ సభ్యులు, గంగపుత్ర సంఘం ప్రతినిధులు మరియు పెద్ద ఎత్తున భక్తులు, ప్రజలు పాల్గొన్నారు.

## విజయదుర్గ కాలనీలో సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన..



**కరీంనగర్ టౌన్ మన జనప్రగతి ఆగస్టు 16:** కరీంనగర్ నగరపాలక సంస్థ పరిధిలోని 21వ డివిజన్ విద్యానగర్ విజయదుర్గ కాలనీలో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులకు నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ నగరంలోని ప్రతి డివిజన్‌లో మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. ప్రజలకు మెరుగైన రహదారి సౌకర్యాలు కల్పించేందుకు అవసరమైన ప్రాంతాలను గుర్తించి దశలవారీగా సీసీ రోడ్లు, డ్రైనేజీ తదితర అభివృద్ధి పనులు చేపడుతున్నామని పేర్కొన్నారు. నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ పనులను వేగవంతంగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. విజయదుర్గ కాలనీలో సీసీ రోడ్డు నిర్మాణంతో స్థానిక ప్రజలకు రాకపోకలు మరింత సౌకర్యవంతంగా మారనున్నాయని, కాలనీ అభివృద్ధికి అవసరమైన ఇతర మౌలిక వసతుల కల్పనకు కూడా కృషి చేస్తామని మేయర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ వై. సునీల్ రావు, స్థానిక కార్పొరేటర్ వరాల నర్సింగమ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు మల్లేశం, మున్సిపల్ అధికారులు, స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధులు, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

## కరీంనగర్ ఎంపీ కార్యాలయంలో ఘనంగా వాజ్‌పేయీ వర్ధంతి వేడుకలు...

### ఘన నివాళులు అర్పించిన జిల్లా అధ్యక్షుడు సాయిని మల్లేశం..



**కరీంనగర్ టౌన్ మన జనప్రగతి ఆగస్టు 16:** భారత దేశ మాజీ ప్రధాన మంత్రి, భారతరత్న అటల్ బిహారీ వాజ్‌పేయీ వర్ధంతి వేడుకలను ఆదివారం రోజున కరీంనగర్‌లోని ఎంపీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి భారతీయ జనతా పార్టీ (బీజేపీ) కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు సాయిని మల్లేశం ముఖ్య అతిథిగా విచ్చేసి, వాజ్‌పేయీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించి మాట్లాడారు. దేశం గర్వించదగిన గొప్ప నాయకుడు అటల్ బిహారీ వాజ్‌పేయీ అని జిల్లా అధ్యక్షుడు సాయిని మల్లేశం కొనియాడారు... దేశ సమగ్రతకు, అభివృద్ధికి వాజ్‌పేయీ అందించిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. పోఖ్రాన్ అణు పరీక్షల ద్వారా దేశాన్ని శక్తివంతమైన దేశాల సరసన నిలిపారని, స్వర్ణ చతుర్భుజి, ప్రధాన్ మంత్రి గ్రామీణ సడక్ యోజన వంటి ప్రాజెక్టులతో మౌలిక వసతుల అభివృద్ధికి ఎంతో కృషి చేశారని గుర్తు చేశారు. రాజకీయాల్లో అత్యున్నత విలువలను పాటించిన అజాతశత్రువు అటల్జీ అని, పార్టీలకు అతీతంగా అందరి గౌరవాన్ని అందుకున్న గొప్ప పరిపాలనాదక్షుడని వక్తలు కొనియాడారు. వాజ్ పాయ్ చూపిన బాటలో నడవాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీజేపీ పార్లమెంట్ కన్వీనర్ బోయిన్పల్లి ప్రవీణ్ రావు, సీనియర్ నాయకులు గుజ్జ శ్రీనివాసరావు, యువ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు నేరెడ్ల ప్రవీణ్ రెడ్డి, జిల్లా అధ్యక్షులు సంఘ నరేష్, కిసాన్ మోర్చా అధ్యక్షులు మోతే గంగారెడ్డి , కోశాధికారి వైద రామానుజం , నాయకులు ముత్యాల జగన్ రెడ్డి , నక్క ప్రమోద్ , గడ్డం అరుణ్ , దయ్యాల మల్లేశం నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొని వాజ్‌పేయీకి తమ నివాళులు అర్పించారు.

మనజనప్రగతి
జనం కోసం.. అక్షర ప్రగతి... తెలుగు దినపత్రిక
17- 08 - 2026

# బహుముఖ ప్రజ్ఞాశాలి కోట్ల విజయ భాస్కర్ రెడ్డి: మాజీ ఎంపీ నర్రెడ్డి తులసి రెడ్డి



**వేంపల్లె మన జనప్రగతి ఆగస్టు 16:–** బహుముఖ ప్రజ్ఞాశాలి మాజీ ముఖ్యమంత్రి కోట్ల విజయభాస్కర్ రెడ్డి అని మాజీ ఎంపీ, రాష్ట్ర కాంగ్రెస్ మీడియాసెల్ చైర్మన్ డాక్టర్ నర్రెడ్డి తులసిరెడ్డి పేర్కొన్నారు. వేంపల్లి లో ఆదివారం స్వర్గీయ కోట్ల విజయభాస్కర్ రెడ్డి జయంతిని కాంగ్రెస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తులసి రెడ్డి తన సతీమణి అలివేలమ్మ తో కలిసి కోట్ల విజయభాస్కర్ రెడ్డి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోట్ల విజయ భాస్కర్ రెడ్డి న్యాయవాదిగా, క్రీడాకారునిగా,రాజకీయ నాయకునిగా, పరిపాలన దక్షునిగా బహుముఖ ప్రజ్ఞాశాలి గా పేరు గడించారన్నారు . కోట్ల విజయభాస్కర్ రెడ్డి కర్నూలు జిల్లా పరిషత్ చైర్మన్ గా, ఐదుసార్లు శాసనసభ్యునిగా,ఆరుసార్లు పార్లమెంటు సభ్యునిగా, రాష్ట్ర మంత్రిగా, కేంద్ర మంత్రిగా, రెండుసార్లు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ కు ముఖ్యమంత్రిగా ఆయన అనేక పదవులు అలంకరించి పదవులకే వన్నెతెచ్చిన గొప్ప వ్యక్తి ఆయన అని కొనియాడారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు డాక్టర్ సుబ్రహ్మణ్యం,వేంపల్లి మండల శాఖ అధ్యక్షుడు బీగాల రామకృష్ణ, చక్రాయపేట మండల శాఖ అధ్యక్షుడు రామాంజనేయరెడ్డి, సీనియర్ కాంగ్రెస్ నాయకులు అమర్నాథ్ రెడ్డి,ఉత్తన్న, తోపిరెడ్డి రవీంద్రనాథ్ రెడ్డి,చిన్నకోట్ల నాగరాజు, ఐచర్ రమణ తదితరులు పాల్గొన్నారు.

# పిజిఆర్ఎస్ సేవలపై ప్రజలు స్పందన తెలియజేయండి: కమిషనర్




**ప్రొద్దుటూరు స్టాఫ్ రిపోర్టర్ మన జనప్రగతి ఆగస్టు 16:–**జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి ఆదేశాల మేరకు ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్) ద్వారా అందుతున్న సేవలపై ప్రజలు తమ స్పందనను తెలియజేయాలని ప్రొద్దుటూరు మున్సిపల్ కమిషనర్ తూతిక శ్రీనివాస విశ్వనాథ్ విజ్ఞప్తి చేశారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా మరింత పారదర్శకత, జవాబుదారీతనంతో కూడిన సేవలను అందించేందుకు ప్రభుత్వం నిరంతరం ప్రజల అభిప్రాయాలను సేకరిస్తోందన్నారు. ప్రజల సంతృప్తి స్థాయిని మెరుగుపరచడంతో పాటు పిజిఆర్ఎస్ వ్యవస్థను మరింత బలోపేతం చేయడమే లక్ష్యమన్నారు. పిజిఆర్ఎస్ కేంద్రాలను సందర్శించే పౌరుల నుంచి అభిప్రాయాలను సేకరించేందుకు మున్సిపల్ కార్యాలయం, వార్డు సచివాలయాల్లో క్యూ.ఆర్. కోడ్‌లను ఏర్పాటు చేసినట్లు కమిషనర్ తెలిపారు. ప్రజలు క్యూ.ఆర్. కోడ్‌ను స్కాన్ చేసి పిజిఆర్ఎస్ సేవలపై తమ అభిప్రాయాన్ని తెలియజేయాలని కోరారు. క్యూ.ఆర్. కోడ్ ద్వారా ప్రజలు తెలిపే స్పందన అధికారిక పిజిఆర్ఎస్ పోర్టల్‌కు చేరుతుందని తెలిపారు. అర్జీల స్థితిగతులను తెలుసుకునేందుకు టోల్‌ఫ్రీ నంబర్ 1100కు ఫోన్ చేయవచ్చన్నారు. ప్రతి సోమవారం మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించే పిజిఆర్ఎస్ కార్యక్రమంలో ప్రజలు తమ సమస్యలపై అర్జీలు సమర్పించాలని, అనంతరం అందుతున్న సేవలపై క్యూ.ఆర్. కోడ్ ద్వారా స్పందన తెలియజేయాలని కమిషనర్ శ్రీనివాస విశ్వనాథ్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

# రైతు సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీయాలి



**కర్నూలు,మన జనప్రగతి ఆగస్టు 16:–** వచ్చే అసెంబ్లీ సమావేశాల్లో రైతుల సమస్యలపై ప్రభుత్వం దృష్టి సారించేలా ప్రతిపక్షం నిలదీయాలని మాజీ మంత్రి, కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సభ్యుడు ఎన్. రఘువీరారెడ్డి డిమాండ్ చేశారు.మాజీ ముఖ్యమంత్రి కోట్ల విజయభాస్కరరెడ్డి 106వ జయంతి సందర్భంగా కిసాన్ ఘాట్‌లో ఆయన సమాధిని సందర్శించి నివాళులర్పించిన రఘువీరారెడ్డి, అనంతరం జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. విద్యార్థుల సమస్యలు, పేపర్ లీకేజీలతో నష్టపోయిన వారికి న్యాయం, ప్రభుత్వ ఉద్యోగాల భర్తీకి చర్యలు తీసుకోవాలని కోరారు.కోట్ల విజయభాస్కరరెడ్డి నీతి, నిజాయితీకి ప్రతీకగా నిలిచిన నాయకుడని కొనియాడారు. రైతులకు బోర్ల అనుమతులు మంజూరు చేయాలని, ఎల్‌నినో ప్రభావంతో నష్టపోయిన రైతులను ఆదుకోవాలని, ఉద్యాన పంటలకు ప్రోత్సాహం అందించాలని ప్రభుత్వాన్ని కోరారు. శ్రీశైలం నీటిని తాగు, సాగునీటి అవసరాలకు ప్రాధాన్యమివ్వాలని రెండు రాష్ట్రాల ముఖ్యమంత్రులను కోరారు.ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు బోయ క్రాంతి నాయుడు, పలువురు కాంగ్రెస్ నాయకులు, యువజన కాంగ్రెస్ నేతలు పాల్గొన్నారు.

# ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికను సద్వినియోగం చేసుకోండి



**తిరుపతి మన జనప్రగతి ఆగస్టు 16:–** ప్రతి సోమవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో నిర్వహించే డయల్ యువర్ కమిషనర్, ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎం.జయకృష్ణ, ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. తిరుపతి నగరపాలక సంస్థ కార్యాలయంలో ఆగస్ట్ 17 వ తేది సోమవారం ఉదయం 10 గంటల నుండి 2 గంటల వరకు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం, 10.30 నుండి 11.30 గంటల వరకు డయల్ యువర్ కమిషనర్ కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. ఫోన్ ద్వారా పిర్యాదులు చేసేవారు 0877-2227208 కి కాల్ చేసి మాట్లాడవచ్చని, ఈ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాల్సిందిగా తిరుపతి ప్రజలకు కమిషనర్ ఎం.జయకృష్ణ, తెలియజేశారు.

# పులివెందులలో ఘనంగా నాగులచవితి వేడుకలు

## - భక్తిశ్రద్ధలతో నాగదేవతలకు ప్రత్యేక పూజలు



**పులివెందుల అర్బన్ మన జనప్రగతి ఆగస్టు 16:–** పులివెందుల పట్టణంలో నాగులచవితి వేడుకలను పురస్కరించుకుని ఆలయాలు,నాగుల కట్టల వద్ద భక్తులు ఆదివారం భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు.బ్రాహ్మణపల్లి రోడ్డులోని నాగుల కట్ట వద్ద కొంగనపల్లి కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో ఉదయం నాగదేవతకు విశేష పూజలు చేపట్టారు.భక్తులు పుట్టల వద్ద నూలు చీరలు ఉంచి, చుట్టూ నూలు దారం చుట్టి ప్రదక్షిణలు చేశారు. నాగదేవతకు చలిమిడి, నువ్వుల పిండిని నైవేద్యంగా సమర్పించి,కొబ్బరికాయలు, కర్పూర హారతులు ఇచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాల పంపిణీ జరిగింది.అలాగే పట్టణంలోని శ్రీ రంగనాథస్వామి ఆలయం, పార్నపల్లె రోడ్డులోని షిరిడీ సాయిబాబా మందిరం,శ్రీ మిట్టమల్లేశ్వరస్వామి ఆలయ ప్రాంగణాల్లోని నాగుల పుట్టల వద్ద మహిళలు పెద్ద సంఖ్యలో నోములు నోచుకుని పూజా కార్యక్రమాలు నిర్వహించారు.ఈ సందర్భంగా మహిళలు ఉపవాస దీక్షలు చేపట్టారు.సోమవారం నాగపంచమి,గరుడ పంచమి పర్వదినాలు కలిసి రావడంతో నాగదేవతలకు మరింత వైభవంగా ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు వెల్లడించారు.సోమవారం ఉదయం పుట్టలో పాలు పోసి భక్తులు తమ ఉపవాస దీక్షలను విరమించనున్నారు.

# ఒకే వేదికపై పోలీస్ బ్రదర్స్‌కు ప్రశంసా పత్రాలు



**పీలేరు,మన జనప్రగతి ఆగస్టు 16:–** మదనపల్లి బీటీ కళాశాల మైదానంలో నిర్వహించిన 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో విశిష్ట సేవలు అందించిన పలువురు అధికారులు, సిబ్బందికి మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ప్రశంసా పత్రాలు అందజేశారు.ఈ సందర్భంగా పోలీస్ శాఖలో సేవలందిస్తున్న అన్నదమ్ములు కే. సునీల్ కుమార్, కే. విజయ్ కుమార్ ఒకేసారి ప్రశంసా పత్రాలు అందుకోవడం ప్రత్యేకంగా నిలిచింది. ప్రస్తుతం సునీల్ కుమార్ పీలేరు సర్కిల్ పోలీస్ స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా, విజయ్ కుమార్ కలికిరి పోలీస్ స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నారు.ప్రజలకు బాధ్యతాయుతంగా సేవలందిస్తూ గుర్తింపు పొందిన ఇద్దరు అన్నదమ్ములకు ఒకే వేదికపై ప్రశంసా పత్రాలు లభించడంతో కుటుంబ సభ్యులు, సహచరులు, స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. ఈ గౌరవం తమపై మరింత బాధ్యతను పెంచిందని, భవిష్యత్తులోనూ ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తామని సునీల్, విజయ్ తెలిపారు.

# ప్రజలతో కమిషనర్ ముఖాముఖి

**ప్రొద్దుటూరు స్టాఫ్ రిపోర్టర్ మన జనప్రగతి ఆగస్టు 16:–** ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని వాటికి పరిష్కారం చూపేందుకు ప్రొద్దుటూరు మున్సిపాలిటీ ఆధ్వర్యంలో "ప్రజలతో కమిషనర్‌తో ముఖాముఖి" కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ప్రతి సోమవారం ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ తోటిక శ్రీనివాస విశ్వనాథ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఆగస్టు 17, 2026 సోమవారం ఉదయం 9 గంటల నుంచి 10 గంటల వరకు ప్రజలు తమ సమస్యలను నేరుగా మున్సిపల్ కమిషనర్‌కు తెలియజేయవచ్చు. ఒక గంటపాటు జరిగే ఈ కార్యక్రమంలో ప్రజల నుంచి వినతులు స్వీకరించి, సంబంధిత సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకోనున్నారు. ప్రజలు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లేందుకు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ కోరారు. ఫిర్యాదులు/సమాచారం కోసం:9247563385 / 9849905863.

# శ్రీరాములపేటలో వర్ధన్ క్లినిక్ ప్రారంభం



**ప్రొద్దుటూరు స్టాఫ్ రిపోర్టర్ మన జనప్రగతి ఆగస్టు 16:–** శ్రీరాములపేటలోని డాక్టర్ ప్రసాద్ రెడ్డి హాస్పిటల్ బిల్డింగ్‌లో డా. వేద వర్ధన్ రెడ్డి ఆధ్వర్యంలో వర్ధన్ క్లినిక్ ను ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ప్రముఖులు మాజీ ఎంపీపీ నంద్యాల రాఘవరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ బచ్చల పుల్లయ్య, బసిరెడ్డి రాజేశ్వర్ రెడ్డి, కొత్తపల్లి మాజీ సర్పంచ్ కొని రెడ్డి శివచంద్రారెడ్డి తదితరులు హాజరై క్లినిక్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు డా. వేద వర్ధన్ రెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు.ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు వర్ధన్ క్లినిక్ ఏర్పాటు చేయడం అభినందనీయమని ప్రముఖులు పేర్కొన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, స్థానిక ప్రముఖులు, క్లినిక్ నిర్వాహకులు, తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా గౌతు లచ్చన్న జయంతి వేడుకలు




**సిద్ధవటం, మన జనప్రగతి, ఆగస్టు 16:–** భాకరాపేట సమీపంలోని ఏపీఎస్పీ 11వ పోలీస్ పటాలయంలో ఆదివారం ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు, ప్రజా నాయకుడు డాక్టర్ సర్దార్ గౌతు లచ్చన్న జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. కమాండెంట్ ఆనందరెడ్డి ఆదేశాల మేరకు అసిస్టెంట్ కమాండెంట్ వెంకటప్ప ఆధ్వర్యంలో గౌతు లచ్చన్న చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వెంకటప్ప మాట్లాడుతూ.. బడుగు, బలహీన వర్గాల హక్కుల కోసం గౌతు లచ్చన్న నిరంతరం పోరాడారని తెలిపారు. బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా పోరాడిన ఆయన, అనంతరం సామాజిక న్యాయం, పేదల సంక్షేమం, వెనుకబడిన వర్గాల అభ్యున్నతికి తన జీవితాన్ని అంకితం చేశారని కొనియాడారు. కార్యక్రమంలో రిజర్వ్‌డ్ ఇన్‌స్పెక్టర్లు, బెటాలియన్ సిబ్బంది పాల్గొన్నారు.

# ముఖ్యమంత్రి సహాయ నిధి పథకం పేదలకు వరం



**ఆళ్లగడ్డ మన జనప్రగతి ఆగస్టు 16:** ముఖ్యమంత్రి సహాయనిధి పథకం పేదలకు వరమని ఎమ్మెల్యే అఖిలప్రియ అన్నారు. మండలంలోని కోటకందుకూరు గ్రామానికి చెందిన హుస్సేన్ సా కుటుంబానికి 4.40 లక్షల సి.యం.రిలీఫ్ ఫండ్ చెక్కును ఆదివారం ఎమ్మెల్యే అఖిలప్రియ అందజేశారు. చెక్కును అందుకున్న హుస్సేన్ షా కుటుంబ సభ్యులు ముఖ్య మంత్రి చంద్ర బాబు నాయుడుకి, ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ కు కృతజ్ఞతలు తెలియ జేశారు. ఈ కార్యక్రమంలో తెలుగు గంగ డిస్ట్రిబ్యూటరీ కమిటీ-7 ఉపాధ్యక్షురాలు సుద్దపల్లె సమీరా, సున్నే సాబ్ గారి మా భాష, నర్సిపల్లి ఇస్మాయిల్, ఆళ్ల సుబ్బయ్య తదితరులు ఉన్నారు.

# కొత్తూరు సుబ్బరాయునికి 140 గ్రాముల వెండి నాగాభరణం విరాళం..!



**పాణ్యం మన జనప్రగతి ఆగస్టు 16:** ప్రముఖ శైవక్షేత్రం పాణ్యం మండలం ఎస్.కొత్తూరు గ్రామంలో వెలిసిన శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారికి 140 గ్రాముల వెండి నాగాభరణం ను ఆదివారం భక్తులు విరాళంగా సమర్పించినట్లు ఆలయ ఈవో యం.రామక్రిష్ణ తెలిపారు. పాణ్యం కు చెందిన దొంతు లక్ష్మీదేవి, కుమారుడు సుధాకర్, కోడలు రేణుక వారికి శ్రీ స్వామి వారు ఇంటి ఇలవేల్పు కావడంతో మొక్కుబడిగా 80వేలు విలువగల 140 గ్రాముల వెండి నాగాభరణం వితరణ చేశారు. ఈ సందర్భంగా దాతకు ఆలయ మర్యాదలతో స్వామివారికి అభిషేకములు, అర్చనలు, విశేష పూజలు నిర్వహించి ప్రసాదం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది సుబ్బారెడ్డి, నాగేశ్వరరావు, దాత కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# వివాహ వేడుకకు హాజరైన ఏపీ మార్క్‌ఫెడ్ డైరెక్టర్ తులసిరెడ్డి



**నంద్యాల మన జనప్రగతి ఆగస్టు 16:** కర్నూలు నగరంలోని పుష్పరాజు ఫంక్షన్ హాల్‌లో ఆదివారం జరిగిన ఓ వివాహ వేడుకకు ఆంధ్రప్రదేశ్ మార్క్‌ఫెడ్ డైరెక్టర్, ప్రముఖ సీనియర్ న్యాయవాది తాతిరెడ్డి తులసిరెడ్డి హాజరై . నూతన వధూవరులను ఆశీర్వదించి, వారి వైవాహిక జీవితం ఆనందమయంగా సాగాలని ఆకాంక్షించారు. ఆయనతో పాటు పలువురు స్థానిక ప్రముఖులు, బంధుమిత్రులు పెద్ద సంఖ్యలో ఈ వేడుకలో పాల్గొని నూతన దంపతులకు శుభాకాంక్షలు తెలియజేశారు.



PRINTER, PUBLISHER AND OWNED BY **YADATI VIVEKANANDA REDDY YADAV**, AND PRINTED AT M/S GOKUL PUBLICATIONS, # 4-10-19, Ambakapalli Road, Pulivendula - 516390, Ysr/ Kadapa District, (Andhra Pradesh), PUBLISHED AT # 4-10-19, Ambakapalli Road, Pulivendula - 516390, Ysr/ Kadapa District, (Andhra Pradesh), Editor : YADATI VIVEKANANDA REDDY YADAV, E-Mail :manajanapragathi@gmail.com, Cell : 8125555507 RNI No : - APTEL/2021/80174